

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 06 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 07, డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



# దారి తప్పుతున్న.. రాజకీయాలు !

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

ప్రజాధనాన్ని దుర్వినియోగపరచడం ఎంతటి మోసమో రాజకీయాలను దారి మళ్ళించడం అంతే మోసమని డాక్టర్ బరిగెల హెచ్చరించారు.ప్రస్తుతం తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో హాట్ టాపిక్ గా మారు తున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు అధికార పార్టీలు గానీ ప్రతిపక్ష పార్టీలు గాని కేవలం రాజకీయ అధికార, పదవులపై మాత్రమే దృష్టి పెడుతున్నట్లుగా రాజకీయ పరిణామాలు వెల్లడిస్తున్నాయన్నారు.ప్రాణ త్యాగాలను పణంగా పెట్టి తెచ్చుకున్న తెలంగాణలో రైతులు మొదలుకొని నిరు ద్యోగులు మొదలుకొని నిరుపేదలు మొదలు కొని నేటి వరకు బలవన్మరణాలు కొనసాగు తూనే ఉన్నాయని విచారణ వ్యక్తం చేశారు. వేగంగా దారి తప్పుతున్న రాజకీయాల వల్ల సాధారణ ప్రజల జీవన విధానం, జీవనా ధారం కూడా పూర్తిగా మారిపోతున్నాయని రాజకీయాల్లో కొనసాగుతున్న మార్పుల వల్ల ఇరు రాష్ట్రాల ప్రజలు ఎంతో వేదన పడుతున్నారన్నారు.రాజకీయ పదవుల్లో గాని ప్రభుత్వాల ఏర్పాటులలో గాని జనాభా లెక్కల ఆధారంగా ఎక్కడ అధికారాలు దక్కబడడం లేదన్నారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో నైతే చాలా గ్రామాలలో సర్పంచ్ పదవి కోసం గ్రామస్తులను - మిగతా 2లో..

ప్రజా బలం కన్నా పైస బలానికే పెద్దపీట వేస్తున్నారు

రాజకీయాల్లో నిజాయితీ కన్నా పైస ప్రాధాన్యత ఎక్కువగా పెరుగుతుంది

రాజకీయం అంటేనే పైసలు పంచడం అనే దుస్థితికి దిగజారుస్తున్నారు

కుల ప్రాతిపదికన రాజకీయాలు రాటు దేలుతున్నాయి

ప్రధాన పార్టీలన్నీ రాజకీయ రంగులను మారుస్తున్నారు

బీసీ కులాల రిజర్వేషన్ల హక్కుల కోసం ఆత్మహత్యలు మొదలయ్యాయి

ప్రాణ త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణలో బలవన్మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి

అధికారాన్ని సంపాదించుకోవడం కోసం ఎన్నేసి అడ్డదారులు తొక్కుతున్నారు

పైసా సంపాదన కోసం మనోడు లేదు మందోడు లేదు అంతా ఒకటే

పార్టీలు వేరైనా పలుకుబడి కలిగినోళ్లంతా ఒక్కతాటిపై నడుస్తున్నారు

దారి తప్పుతున్న రాజకీయాల వల్ల అప్పుల పాలవుతున్న సామాన్యులు

డాక్టర్ బరిగెల శివ




## కొడంగల్‌లో వినూత్న ప్రచారం


రూ.100 బాండ్‌పై ఎన్నికల మేనిఫెస్టో

రూ.100 బాండ్ పేపర్‌పై సర్పంచ్ అభ్యర్థి మేనిఫెస్టో విడుదల

హామీలు అమలు చేయకపోతే నిలదీయవచ్చని స్పష్టీకరణ

ఆడపిల్ల పుడితే, పెళ్లికి ఆర్థిక సాయం వంటి పలు హామీలు

2



## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

రేవంత్ రెడ్డి విహంగ వీక్షణం

ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే

100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ఆర్థిక సదస్సు

2



## చరిత్రలో ఎన్నడూలేని రీతిలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 'ఆపరేషన్ కవచ్': సజ్జనార్

ఆపరేషన్ కవచ్ పేరుతో నాకాబందీ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెల్లడి

రాత్రి 10 గంటల నుంచి నాకాబందీ నిర్వహిస్తున్నామన్న సజ్జనార్

5,000 మంది పోలీసు సిబ్బందితో ఏకకాలంలో 150 కీలక ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు

2

## దక్షిణాఫ్రికాలో భువనగిరి యువకుడిని కిడ్నాప్ చేసిన ఉగ్రవాదులు

మాలిలో ప్రవీణ్‌ను అపహరించిన ఉగ్రవాదులు


గత నెల 23న ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

కుమారుడిని విడిపించాలని కేంద్ర ప్రభుత్వానికి తల్లిదండ్రుల వేడుకోలు

భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్న కంపెనీ

2





## కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా ఉస్మానియా..

రూ.1000 కోట్లతో అభివృద్ధి

అంతర్జాతీయ ప్రమాణాలతో ఓయూ రూపురేఖల మార్పునకు ప్రణాళిక

అభివృద్ధి పనులపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

డిజైన్లపై విద్యార్థులు, ప్రొఫెసర్ల అభిప్రాయాలకు ప్రాధాన్యత

ఈ నెల 10న ఓయూను సందర్శించనున్న ముఖ్యమంత్రి

2

సమస్యలపై సమరంగా
జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# కొడంగల్‌లో వినూత్న ప్రచారం

**రూ.100 బాండ్‌పై ఎన్నికల మేనిఫెస్టో**
**రూ.100 బాండ్ పేపర్‌పై సర్పంచ్ అభ్యర్థి మేనిఫెస్టో విడుదల**
**హామీలు అమలు చేయకపోతే నిలదీయవచ్చని స్పష్టీకరణ**
**ఆడపిల్ల పుడితే, పెళ్లికి ఆర్థిక సాయం వంటి పలు హామీలు**

కొడంగల్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు వినూత్న రీతిలో ప్రచారం చేస్తూ, సరికొత్త హామీలతో ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మున్నూర్ శివకుమార్ ఏకంగా రూ.100 బాండ్ పేపర్‌పై తన మేనిఫెస్టోను విడుదల చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ అభివృద్ధి, ఆడపిల్ల పుడితే రూ.2,500, పెళ్లి కానుకగా రూ.5,501, అకారణంగా మరణించిన కుటుంబాలకు పంచాయతీ నిధుల ద్వారా రూ.6 వేల ఆర్థిక సాయం, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం వంటి మొత్తం 12 హామీలను ఆ బాండ్ పేపర్‌పై పొందుపరిచారు. తాను సర్పంచ్‌గా గెలిచిన తర్వాత ఈ హామీలను నెరవేర్చకపోతే, గ్రామస్థులు తనను నిలదీయవచ్చని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ఇది ఆయన ప్రచారంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా ఉస్మానియా.. రూ.1000 కోట్లతో అభివృద్ధి

**అంతర్జాతీయ ప్రమాణాలతో ఓయూ రూపురేఖల మార్పునకు ప్రణాళిక**
**అభివృద్ధి పనులపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**
**డిజైన్లపై విద్యార్థులు, ప్రొఫెసర్ల అభిప్రాయాలకు ప్రాధాన్యత**
**ఈ నెల 10న ఓయూను సందర్శించనున్న ముఖ్యమంత్రి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) రూపురేఖలను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా, అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో ఓయూను అభివృద్ధి చేసేందుకు రూ.1000 కోట్లకు పైగా వెచ్చించాలని నిర్ణయించింది. ఈ బృహత్ ప్రణాళిక అమలుపై సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రణాళికలో భాగంగా వర్సిటీలో ప్రపంచస్థాయి పరిశోధనా కేంద్రాలు, మెగా హాస్టళ్లు, హైటెక్ అకడమిక్ బ్లాకులు నిర్మించనున్నారు. వీటితో పాటు సైకిల్, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా సదుపాయాలు, హెల్త్ కేర్ సెంటర్, కన్వెన్షన్ హాల్ వంటి ఆధునిక హంగులను కల్పించనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, ప్రొఫెసర్ల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన డిజైన్ నమూనాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని, వారి సలహాలు స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటు డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓయూ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా చిహ్నాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీలోని చారిత్రక, వారసత్వ కట్టడాలను సంరక్షించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఓయూ అభివృద్ధికి ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ నెల10న తాను ఓయూను సందర్శిస్తానని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

**రేవంత్ రెడ్డి విహంగ వీక్షణం**
**ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు**
**ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే**
**100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ఆర్థిక సదస్సు**

రంగారెడ్డి, జై భీమ్ న్యూస్

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' జరగనుంది. ఈ సదస్సు ఏర్పాట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సును నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు తరలి వస్తారు. గ్లోబల్ సదస్సు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించినదని, తమ విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గ్లోబల్ సమ్మిట్ వివరాలను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 27 సెషన్లు ఉంటాయని, వివిధ రంగాల నిపుణులు, నిష్ణాతులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారని వెల్లడించారు. ముఖ్య అతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇలాంటి సదస్సు గతంలో ఎన్నడూ జరగలేదని భట్టివిక్రమార్క అన్నారు.

# గుత్తాధిపత్యంలో విమానయాన సంస్థ

హైదరాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్): దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గత ఐదు రోజుల నుంచి ఎయిర్‌పోర్టులు అన్ని రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల కంటే అధ్వాన్నంగా మారిపోయాయని విమర్శించారు. కొంతమంది చేతుల్లోనే శక్తి కేంద్రీకృతమైతే జరిగే దుష్పరిణామాలకు ఇది గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇండిగో విమానాలను ఆపేయడంతో ఎయిర్‌పోర్టుల్లో వేలాది మంది తన్నుకునే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఇండిగో ఎందుకు బంద్ పెట్టిందో కారణాన్ని ఆయన వివరించారు. శ్రమ దోపిడీ చేయవద్దని.. పైలట్లు వారానికి ఇంత సమయం మాత్రమే విమానాలు నడపాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఏడాది కింద ఒక రూల్ తీసుకొచ్చిందని తెలిపారు. కానీ దేశంలోని విమానయాన శాఖ మొత్తం ఇండిగో, ఎయిరిండియా చేతుల్లోనే ఉందని.. దీంతో ఏడాది కింద కేంద్ర ప్రభుత్వం రూల్ తీసుకొచ్చినప్పటికీ వాళ్లు మారలేదని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం కూడా ఏర్పాటు చేసుకోలేదని చెప్పారు. దీనివల్ల ఒక్కరోజే ఇండిగో సంస్థ వెయ్యి విమానాలు రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. ఆ దెబ్బతో ఎయిర్‌పోర్టులు అన్ని అధ్వాన్నంగా తయారయ్యాయని చెప్పారు. ఎయిర్‌పోర్టులు బస్టాండ్లలా మారిపోయాయని విమర్శించారు. తప్పు చేశానని ఒప్పుకోలేదని.. అయినప్పటికీ వారికి ఫైన్ వేసే దమ్ము లేదని అన్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వమే తగ్గి గతంలో ఇచ్చిన రూల్‌ను వెనక్కి తీసుకుందని.. విమానయాన కంపెనీలకు కొంత సమయం ఇచ్చిందని పేర్కొన్నారు. కొంతమంది చేతుల్లోనే శక్తి ఉంటే జరిగే దుష్పరిణామాలకు ఇదొక గొప్ప ఉదాహరణ అని తెలిపారు. పోర్టులు, సీపోర్టులు ఇలా అన్ని ఒకరి చేతిలోనే ఉంటే.. ఒకరు మునిగినప్పుడు అందరూ మునగాల్సి వస్తుందని చెప్పారు.

# దారి తప్పుతున్న రాజకీయాలు

మొదటి పేజీ తరువాయి

పట్టించుకోకుండా పక్కనపెట్టి వేలం పాటలు పాడుకుంటూ పదవులు దక్కించుకుంటున్న పరిస్థితులను గమనిస్తూ ఉంటుండగా ప్రజాస్వామ్యం ఎటు పోతుందో ఏం అర్థం కావడం లేదు అన్నారు.ఒకవైపు ఎన్నికల అధికారులు కట్టుదిట్టమైన నియమాలతో సర్పంచ్ ఎన్నికలను నిర్వహిస్తూ ఉంటుండగా గ్రామాల్లో జరుగుతున్న రాజకీయ తదంగాలను ఇటు ఎన్నికల అధికారులు అటు పోలీసులు మరోవైపు రాజకీయ నాయకులు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఏమాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేసినట్లుగా ఉంటుండడంతో పంచాయితీ పెద్దమనుషులమంటూ ప్రతి గ్రామంలోని ప్రధాన స్థలం కాడ సర్పంచుల అభ్యర్థులను కూర్చోబెట్టుకొని పైసలభేదాలు మాట్లాడుకుంటూ సందీలు కుదురుస్తూ రాజకీయాలను దారిమళ్లించడమే కాకుండా సర్పంచ్ పదవుల కోసం ఉన్న కాస్తంత ఆస్తులను అమ్ముకొని పేరు పెగ్గల కోసం గాలి పదవులు ఆశ కోసం గాబర పడుతున్నట్లుగా ప్రతి గ్రామంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు తెలియజేస్తు న్నాయన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీల ఉద్యమం ఉవ్వెత్తున కొనసాగుతుండగా అధికార పార్టీకి వ్యతిరేకమైన ఓట్లు పడతాయేమోనని భయాందోళన చెందుతున్న ప్రజాప్రతినిధులు ఏకగ్రీవ నిర్ణయాలపై గ్రామాలను పెంచి పోషిస్తున్నారని దానివలన రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామంలో చూసిన ఇతర పార్టీల అభ్యర్థుల నామినేషన్లను ఉపసంహరించుకోవడం చేయిస్తుండడంతోపాటు పైసా ప్రభావాన్ని చూపి పోటీ నుండి తప్పించే ప్రయత్నాలు చేస్తుండడం వాటితో పాటు ఏకగ్రీవ తీర్మానం కోసం వేలం పాటలను ఏర్పాటు చేసుకొని గ్రామ రాజకీయాలను గజ్జి రాజకీయాలుగా మారుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల నియమాలను తుంగలో తొక్కుతూ రాజకీయ ఆధిపత్యం కోసం ఎంతలా దిగజారిపోతున్నారో నేడు జరుగుతున్న ఎన్నికలను చూస్తుండగా రాష్ట్ర ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకోవాలో రాజకీయ పార్టీలని ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.మమ్మల్ని ఎవరు అడిగే హక్కులు లేవు అనే విధంగా రాజకీయాలకు కొనసాగడం విచిత్రంగా ఉందన్నారు.గతంలో పైస ఖర్చు లేకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించబడేవని ప్రస్తుతం కోటికి పైన పలుకుతున్న గిరాకీని చూస్తుంటే రానున్న కాలంలో గ్రామాలను ఏం చేస్తారో అర్థం కావడం లేదన్నారు.గ్రామస్థాయి రాజకీయాలు గాడిన పడితేనే తప్ప సిటీ రాజకీయాల అభివృద్ధి మెరుగుపడలేదనేది వాస్తవమని గుర్తు ఎరుగాల్సిన రాజకీయ పార్టీలు గ్రామస్థాయి రాజకీయాలను భ్రష్టు పట్టిస్తూ కావాల్సిన ఆధిపత్యం కోసం గ్రామాలను కాలరాస్తున్నారని నేడు కొనసాగుతున్న రాజకీయ ఆకృత్యాలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయన్నారు.దానికి తోడు కొంతమంది ప్రధాన నాయకులు గ్రామాలను ఏకగ్రీవం చేసుకుంటే లక్షల రూపాయల నిధులను అభివృద్ధి కోసం మంజూరు చేస్తామని బహిరంగ ప్రకటన చేయడ మనేది గ్రామ రాజకీయాలను శాసించడం కోసమేనని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు.చాలాచోట్ల విద్యార్థి నాయకులు మేధావులు గ్రామాలలో సర్పంచి అభ్యర్థుల రిజర్వేషన్లపై తీవ్రమైన అసహనం, అసంతృప్తిని వెళ్ళగకుతున్నారని జనాభా లెక్కల ఆధారంగా ప్రతి గ్రామంలో రావాల్సిన రిజర్వేషన్లను రాజకీయ నాయకుల అనువైన వ్యక్తుల కోసం రిజర్వేషన్లను మార్చుకొని ఏర్పరచుకొని మెజారిటీ ప్రజలను దెబ్బకొట్టే ప్రయత్నం చేశారని అలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు బహిరంగంగా విమర్శలు చేస్తూ ప్రస్తుత రాజకీయాలు దారి తప్పుతుండటంపై ప్రతి గ్రామంలోని ప్రజలు గమనించే వాళ్ళై ఉండాలన్నారు.సోషల్ మీడియా ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా డిజిటల్ మీడియా ఫేస్బుక్ ఇంస్టాగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాలు సర్పంచ్ అభ్యర్థుల జీవితాల్లో వెలుగులు నింపుతాయో చీకటిని నింపుతాయో తెలియదు కానీ ఎన్నికల్లో నిలబడుతున్న అభ్యర్థులందరూ వాటిని విపరీతంగా వాడుకుంటూ ప్రజలకు లేనిపోని హామీలు ఇస్తూ ఆచరణకు సాధ్యంగానే అంశాలను వ్యక్తిగత పూచికత్తుల మీద రాసిపెట్టుకొని ప్రజలపై రుద్దుతూ బలవంతంగా ఓట్ల కోసం బజారుణ పడుతున్నారన్నారు.ఎన్నికల హామీలు ఏమోగానీ రాష్ట్రంలో ఒకవైపు బీసీల రిజర్వేషన్ హక్కుల కోసం మరోవైపు వికలాంగుల సంక్షేమ ఏర్పాటు కోసం వాటితో పాటు నిరుద్యోగ యువత పడుతున్న బాధలను, రైతుల కష్టాలను,పూర్తిస్థాయిలో విస్మరిస్తున్న ప్రభుత్వాలే రాజకీయ ఆధిపత్యాన్ని చలాయిస్తూ కొనసాగిస్తున్నారని అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామంటూనే ఏండ్లు గడుస్తున్నా గ్రామాల అభివృద్ధి మారకపోవడం రాజకీయాల్లో నిజాయితీ కలిగిన నాయకులు కనబడకపోవడం ప్రస్తుత రాజకీయాల్లో ప్రధాన అంశాలుగా చూస్తున్నామన్నారు.ఇరు రాష్ట్రాల్లో ప్రతి పౌరుని ప్రతి పౌరురాలు హక్కులు రక్షించబడాలని ప్రస్తుతం దారి తప్పుతున్న రాజకీయాల వల్ల అవి సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు.రాజకీయాలను చక్కపరుస్తారా ప్రజల మేలు కొరకు పని చేస్తారా లేదంటే ఏం చేసైనా అధికారం దక్కించుకుంటారా నిజాయితీతో కూడిన సమాధానాన్ని ప్రజలకు తెలుపండి అంటూ ప్రభుత్వాలకు సవాల్ విసిరారు.గ్రామస్థాయి ఎన్నికలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని దళారీగాళ్ల మాటలతో గ్రామాలను తాకట్టు పెట్టొద్దని ప్రత్యేకించి కోరారు.అంది వచ్చిన అవకాశాలను జారవిడుచుకోకుండా సరైన నాయకులను ఎన్నుకొని గ్రామాలను అభివృద్ధి పథంలోనికి నడిపించుకొండంటూ గ్రామస్థాయి ప్రజలకు గుర్తు చేశారు.గ్రామాలను అభివృద్ధి పరచుకుంటారా పైసలకు అమ్ముడుపోయి గ్రామాలను రాజకీయ పార్టీలకు పణంగా పెడతారా ఆత్మసాక్షిగా ఆలోచించుకోండంటూ గ్రామస్థాయి అభివృద్ధిని ప్రజలకు అప్పగించారు.

# చరిత్రలో ఎన్నడూలేని రీతిలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 'ఆపరేషన్ కవచ్': సజ్జనార్

**ఆపరేషన్ కవచ్ పేరుతో నాకాబందీ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెల్లడి**
**రాత్రి 10 గంటల నుంచి నాకాబందీ నిర్వహిస్తున్నామన్న సజ్జనార్**
**5,000 మంది పోలీసు సిబ్బందితో ఏకకాలంలో 150 కీలక ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు**


హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్ నగరంలో 'ఆపరేషన్ కవచ్' పేరుతో నాకాబందీ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. కమిషనరేట్ చరిత్రలో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేసే దిశగా, రాత్రి 10 గంటల నుంచి 'ఆపరేషన్ కవచ్' పేరుతో నగరవ్యాప్తంగా విస్తృతమైన నాకాబందీని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ చరిత్రలోనే మొదటిసారి దాదాపు 5,000 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. ఏకకాలంలో 150 కీలక ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో శాంతిభద్రతలు, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్ విభాగాలతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ బృందాలు సంయుక్తంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రజా భద్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో నగర పౌరులందరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# దక్షిణాఫ్రికాలో భువనగిరి యువకుడిని కిడ్నాప్ చేసిన ఉగ్రవాదులు

**మాలిలో ప్రవీణ్‌ను అపహరించిన ఉగ్రవాదులు**
**గత నెల 23న ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి**
**కుమారుడిని విడిపించాలని కేంద్ర ప్రభుత్వానికి తల్లిదండ్రుల వేడుకోలు**
**భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్న కంపెనీ**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



జీవనోపాధి కోసం ఖండాంతరాలు దాటి వెళ్లిన ఓ తెలంగాణ యువకుడు ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నల్లమాస ప్రవీణ్ దక్షిణాఫ్రికాలోని మాలిలో కిడ్నాప్‌కు గురయ్యాడు. తమ కుమారుడిని సురక్షితంగా విడిపించి స్వదేశానికి తీసుకురావాలని అతడి తల్లిదండ్రులు కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. భువనగిరి మండలం బండసోమారం గ్రామానికి చెందిన నల్లమాస జంగయ్య, మహేశ్వరి దంపతుల రెండో కుమారుడు ప్రవీణ్. హైదరాబాద్‌లోని ఓ బోర్‌వెల్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ పని మీద గత ఏడాది నవంబరులో దక్షిణాఫ్రికాలోని మాలి రాష్ట్రానికి వెళ్లాడు. రోజూ ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడే ప్రవీణ్, గత నెల 22న చివరిసారిగా సంప్రదించాడు. మరుసటి రోజు, నవంబర్ 23న విధులకు వెళ్లి తిరిగి గదికి వస్తుండగా మార్గమధ్యలో జేఎన్ఐఎం అనే ఉగ్రవాద సంస్థ అతడిని కిడ్నాప్ చేసింది. అప్పటి నుంచి ప్రవీణ్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ నెల 4న కంపెనీ ప్రతినిధులు ఫోన్ చేసి ప్రవీణ్ కిడ్నాప్ అయిన విషయాన్ని తల్లిదండ్రులకు ధ్రువీకరించారు. ప్రస్తుతం ప్రవీణ్ ఆచూకీ కోసం కంపెనీ యాజమాన్యం భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరుపుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఉగ్రవాద సంస్థ గతంలోనూ పలువురు విదేశీయులను కిడ్నాప్ చేసినట్లు సమాచారం. తమ కుమారుడిని ఉగ్రవాదుల చెర నుంచి విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ తల్లిదండ్రులు కన్నీటితో విజ్ఞప్తి చేస్తున్నారు.

# పరకామణి చోరీ తరవాత పాశ్చాత్తాపం చెందా

**అందుకే తన ఆస్తిని శ్రీవారికి రాసిచ్చా**
**టీటీడీ పరకామణి చోరీ కేసుపై నిందితుడు రవికుమార్**

**తిరుమల,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

పరకామణి చోరీతో తాను తీవ్ర ఆందోళన చెందానని, అందుకే తన ఆస్తిలో 90శాతం శ్రీవారికి దానం చేశారనని టీటీడీ పరకామణి చోరీ కేసుపై నిందితుడు రవికుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను పెద్ద జీయ్యర్ మఠంలో గుమస్తాగా పని చేస్తూనే.. పలు వ్యాపారాలు చేశానని ప్రస్తావించారు. రెండేళ్ల క్రితం పరకామణిలో చోరికి పాల్పడ్డానని తెలిపారు. పరకామణిలో చోరీ చేయడాన్ని మహాపాపంగా భావించి.. తాను, తన కుటుంబం తమ ఆస్థిలో 90 శాతం వేంకటేశ్వరస్వామివారికి రాసి ఇచ్చామని వివరించారు. తాను ఎవరి ఒత్తిడిలకు తల్లోగలేదని చెప్పుకొచ్చారు. శనివారం తిరుమల వేదికగా రవికుమార్ మీడియాతో మాట్లాడారు . తన ఆస్థిని, డబ్బులను కానీ తాను ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. తనను కొంతమంది బ్లాక్‌మెయిల్ చేశారని.. వారిపై కేసు కూడా పెట్టానని ప్రస్తావించారు. తాను కొన్ని శస్త్ర చికిత్సలు చేయించు కున్నానని.. కొంతమంది తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. న్యాయస్థానం ఆదేశిస్తే.. ఎలాంటి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి అయిన తాను సిద్ధమని చెప్పుకొచ్చారు. తాను, తన కుటుంబం తీవ్ర క్షోభ అనుభవిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా తమపై తప్పుడు ప్రచారం చేయొద్దని రవికుమార్ పేర్కొన్నారు

# పరకామణి చోరీలో రాజీ వ్యవహారం దారుణం

## 11 నుంచి 25 వరకు అటల్-మోదీ సుపరిపాలన యాత్ర

## ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

పరకామణి చోరీ అంశంలో రాజీ చేయడాన్ని ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రంగా తప్పు పట్టారు. దేవుడి సొత్తు విషయంలో రాజీ చేయడం సరికాదని పేర్కొన్నారు. పరకామణి చోరీ కేసు విచారణను జగన్ స్వాగతించాలని కోరారు. ఈ వ్యవహారంలో సీసీ ఫుటేజ్ ఎలా తొలగించారో బయటకు రావాలని పేర్కొన్నారు. కల్తీ నెయ్యి, పరకామణి ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరగాలన్నారు. జగన్ ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధర్మం కోసం మాత్రమే తితిదే నిధులు కేటాయించాలని కోరారు. ఇకపోతే ఈ నెల 11 నుంచి 25 వరకు భాజపా ఆధ్వర్యంలో అటల్-మోదీ సుపరిపాలన యాత్ర చేపట్టనున్నారు. యాత్రకు సంబంధించిన కరపత్రాలు, ఇతర ప్రచార సామగ్రిని రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ తదితరులు ఆవిష్కరించారు. 'అటల్ ఆశయం.. మోదీతో సుసాధ్యం' పేరిట బస్సు యాత్ర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. వాజ్‌పేయీ శత జయంతి కార్యక్రమాలను గుడ్ గవర్నెన్స్ డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. 'వాజ్‌పేయీని పార్టీలకతీతంగా అందరూ గౌరవిస్తారు. మొదటి నుంచి గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లారు. ఎవరినీ నొప్పించకుండా అన్ని పార్టీల మన్ననలను పొందిన వ్యక్తి ఆయన. నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారు' అని కొనియాడారు. అనంతరం శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. వాజ్‌పేయీ వ్యక్తిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పదవులను తృణప్రాయంగా త్యజించిన వ్యక్తి ఆయన. ఒక్క ఓటుతో ప్రధాని పదవి పోతుందని తెలిసీ.. విలువలు పాటించారు. అన్ని జిల్లాల్లో వాజ్‌పేయీ కాంస్య విగ్రహాలు ఆవిష్కరిస్తాం అని తెలిపారు.

# ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం





**జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద పర్వతగిరి, రాయపర్తి లలో పిఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో సమర్ధ నిర్వహణకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్**

**వరంగల్ జిల్లా, 6 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల కీలకమని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం పర్వతగిరి, రాయపర్తి మండల కేంద్రాల్లోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలల్లో వేర్వేరుగా పిఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల పోలింగ్ పక్కడ్బందీగా నిర్వహణకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడతలో గల మూడు మండలాలైన వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి లలో ఈనెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ కు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో అనేక దశల్లో అధికారులు పనిచేసిన క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర ప్రిసైడింగ్ అధికారులదేనని చెప్పారు. కేటాయించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ప్రిసైడింగ్ అధికారులు తప్పకుండా సమయానికి హాజరై సంబంధిత గ్రామపంచాయతీకి సంబంధించిన స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలన్నారు. వారికి కేటాయించిన ఎన్నికల సామాగ్రిని సక్రమంగా తనిఖీ చేసి బ్యాలెట్ పేపర్లలో తమ ప్రిసైడింగ్ స్టేషన్ కు సంబంధించిన వివరాలు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్, ఉపసర్పంచ్ ఎన్నిక ధ్రువపత్రాల జారీ వంటి కార్యక్రమాలు అన్ని స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్రిసైటింగ్ అధికారులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్ర పరిధిని గుర్తించడం, అభ్యర్థుల వివరాలను ప్రదర్శించడం, పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేయడం, పూర్తిగా ప్రిసైడింగ్ అధికారుల బాధ్యతేనని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఎంపీడీవోలు కిషన్, శంకర్ నాయక్ తాహసిల్దారులు శ్రీనివాస్, వెంకట్ స్వామి పిఓలు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో హెూంగార్డ్స్ సేవలు ప్రశంసనీయం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**వరంగల్, 6 డిసెంబర్ 2025(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

63వ హెూంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, శాంతి భద్రతల పరిరక్షణలో హెూంగార్డ్స్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. పరేడ్ మైదానంలో హెూంగార్డ్స్ నిర్వహించిన అద్భుత పరేడ్ అధికారులు, ఆహ్వానితుల ఆకర్షణగా నిలిచింది. తరువాత విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన హెూంగార్డ్స్‌కు కమిషనర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలైన హెూంగార్డ్స్‌కు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హెూంగార్డ్స్ శాంతి భద్రతల పరిరక్షణలో అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయం. పోలీసులు మీ కృషిని ఎన్నటికీ మరవరు. మీరు చేస్తున్న సేవలకు తగ్గట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం మీ సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోంది, అని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో హెూంగార్డ్స్ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు. వాటిలో అధిక గౌరవవేతనం, ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించే హెూంగార్డ్స్‌కు 30 శాతం అదనపు వేతనం, పరేడ్ అలవెన్సును ?100 నుండి ?200కు పెంపు, ఉష్ణ రక్షణ జాకెట్లు, రెయిన్‌కోట్ల పంపిణీ వంటి సదుపాయాలను గుర్తుచేశారు. అదనంగా, హెూంగార్డ్స్‌కు ఉచిత వైద్య సదుపాయం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రియాశీలకంగా చర్యలు తీసుకుంటోంది అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలను ప్రతి హెూంగార్డ్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్‌తో పాటు ఏసిపీలు, ఆర్ఐలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, హెూంగార్డ్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డాక్టర్ అంబేద్కర్ 69వ వర్ధంతి

**"పేదోళ్లకు ఇది ఇంకా చీకటి రోజు" : రేణుకుంట్ల దుర్గాప్రసాద్**

**హసన్ పర్తి, 6 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**



అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా 65వ డివిజన్ ఎల్లాపూర్ అంబేద్కర్ సెంటర్లో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్వచర్ల సుదర్శన్ మాట్లాడుతూ, గడచిన 69 ఏళు ్లగా పేదలు మారాలి, వారి పరిస్థితులు మెరుగుపడాలి అనే మాటలు అనేక మంది నాయకులు సభల్లో చెబుతూ వచ్చారు. కానీ పేదల కోసం నేల మీద పని చేసే నాయకత్వం చాలా అరుదు. అటువంటి మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ం తన కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాన్ని త్యజించి పేదల కోసం, సమాజ మార్పుకోసం పోరాడిన మహెూన్నత వ్యక్తి, అని పేర్కొన్నారు. గ్రామంలో అనేకమంది రాజకీయ మేధావులు ఉన్నప్పటికీ, అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా గ్రామస్థాయిలో స్పందన తక్కువగా ఉండటం విచారకరమని అన్నారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వారు ఈ కార్యక్రమాల పట్ల కూడా నిర్లక్ష్యం చూపితే, ప్రజలకు ఎలా సేవ అందిస్తారు? రాబోయే ఎన్నికల్లో ఎవరిని ఎన్నుకోవాలి అనే ఆలోచన ప్రతి కుటుంబంలో ప్రారంభం కావాలి అని ఆయన సూచించారు. అంబేద్కర్ అందరి నాయకుడు అనే స్ఫూర్తితో యువత సంఘాలను స్థాపించి, సామాజిక అవగాహన పెంపొందించుకోవాలని, అంబేద్కర్ చూపించిన దారిలో నడిస్తే ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చని సుదర్శన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలిసోజు రమణాచారి, గోపనబోయిన సతీష్, వీరబోయిన ఐలయ్య, మెడికల్ షాప్ రాజు, గాజుల నరేష్, రేణుకుంట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# చలి తీవ్రత పెరుగుతోంది

**వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
**హనుమకొండ డిఎంహెచ్ఓ అప్పయ్య సూచనలు**

**హన్మకొండ, 6 డిసెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోవడంతో చలి తీవ్రత గణనీయంగా పెరుగుతోంది. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉండడంతో వృద్ధులు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ. అప్పయ్య ప్రజలకు సూచించారు. చల్లటి గాలులు, వాతావరణ మార్పులు, తేమ అధికంగా ఉండటం వల్ల జలుబు, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం, తుమ్ములు, శ్వాసకోశ సమస్యలు వంటి వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లల్లో న్యూమోనియా ప్రమాదం, వృద్ధుల్లో శ్వాసకోశ సంబంధిత అసౌకర్యాలు అధికంగా ఉన్నాయని చెప్పారు. చల్లని గాలి ద్వారా వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ వంటి సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి రోగనిరోధక శక్తిని తగ్గిస్తున్నాయని, గాలి ద్వారా వ్యాధులు వ్యాపించే ప్రమాదం భారీగా ఉన్నందున జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. డాక్టర్ అప్పయ్య ఈ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా సూచించారు. చిన్నపిల్లలకు స్వెట్టర్లు, చెవులకు టోపీ, చేతులు%-%కాళ్లకు సాక్స్, గ్లౌజులు వేయించాలని, నెలల చిన్నారులను తల్లి పొత్తిళ్లలో ఉంచి ఉదయం ఎండలో కొద్దిసేపు పట్టాలని అన్నారు. చిన్నారులతో తెల్లవారుజామున, రాత్రివేళ ప్రయాణాలు చేయకూడదని సూచించారు. పిల్లలకు అవసరమైన టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని, చలిలో పిల్లలను బయట ఆడనివ్వకూడదని సూచించారు. ఆస్తమా వంటి శ్వాస సంబంధిత సమస్యలున్న వారు చల్లని గాలి, తేమకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రివేళ చల్లగాలి ఇంట్లోకి రాకుండా కిటికీలు, తలుపులు మూసి ఉంచడం అవసరమని చెప్పారు. అలాగే వాకింగ్‌కు వెళ్లే వారు తలను మూకీ క్యాప్ లేదా మఫ్లర్‌తో కప్పుకోవాలని, ద్విచక్ర వాహనదారులు చలి ఎక్కువగా ఉన్న సమయంలో హెల్మెట్, గ్లౌజులు, స్వెటర్లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. చల్లని వాతావరణంలో శరీరం వెచ్చగా ఉండేందుకు వేడి వేడి ఆహారం మూడు పూటలు తీసుకోవడం చాలా ముఖ్యం అని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ సూచనలను ఖచ్చితంగా పాటించడం ద్వారా చలికాలంలో వచ్చే వ్యాధులను నివారించుకోవాలంటూ డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో ఘన నివాళులు

**కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్**
**కులాంతర వివాహాల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే తీసుకురావాలి**



**హన్మకొండ, 6 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ఘనంగా నివాళు లర్పణ చేపట్టారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సేవావనతిని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ, "ప్రభుత్వం కులాంతర వివాహాల వేదిక రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలి. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే" అని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాజ్యాంగం ఇచ్చిన ఓటుహక్కు ద్వారా ఏర్పడిన ప్రజాప్రతినిధులే అయినప్పటికీ, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను అమలు చేయడంలో అనేక వైఫల్యాలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. భారతదేశవ్యాప్తంగా దళితులపై అగ్రవర్ణ ఆధిపత్యం, గ్రామాల్లో కొనసాగుతున్న వివక్షత, సామాజిక బహిష్కరణ, కులాంతర వివాహాలపై దాడులు ఇప్పటికీ ఆగలేదని పేర్కొన్నారు. ఊరు చివర ఉండాలి అనే కులవ్యవస్థ దోరణి ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కొనసాగుతోంది. రచ్చబండల వద్ద కూర్చోనీయకపోవడం, కుల ఆంక్షలు విధించడం, గ్రామ బహిష్కరణలు, కులాంతర వివాహం చేసుకుంటే దళితుడనే పేరుతో అవమానాలు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులపై, ఐపీఎస్ అధికారులపై కూడా కుల పేరుతో దాడులు జరగడం ం ఇవన్నీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన చర్యలు, అని మంద సంపత్ ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ప్రాథమిక హక్కులను కాపాడే బాధ్యత ప్రభుత్వాలదేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యపు బలానికి మూలమైన ఈ విలువలను రక్షించడానికి ప్రభుత్వాలు ముందుండాలని, దళితులపై జరుగుతున్న దాడులకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య, ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్, జిల్లా నాయకులు మంద మల్లేశం, కులాంతర వివాహాల వేదిక జిల్లా కన్వీనర్ ఇస్లావత్ రవీందర్, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

# జోగి రమేష్ అండతోనే మద్యం దందా

విజయవాడ,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్): వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి జోగి రమేష్ అండతోనే ఇబ్రహీంపట్నంలో అద్దేపల్లి జనార్ధన్రావు నకిలీ మద్యం దందా మొదలుపెట్టారని ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. కూటమి ప్రభుత్వంలో ఊరూరా నకిలీ మద్యం తయారవుతోందని దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా ఆయనతో ములకలచెరువులో జోగి రమేష్ నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటు చేయించారని అధికారులు గుర్తించారు. విజయవాడ నకిలీ మద్యం కేసులో సిట్ ఎనిమిది మంది నిందితులపై ఎక్సైజ్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో పలువురు వ్యక్తుల పాత్రను అధికారులు వివరించారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధనరావు (ఎ1), ఆయన సోదరుడు జగన్మోహన్‌రావు (ఎ2) కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు.

# వర్ధన్నపేట మండలంలో.. చూరుగ్గా గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం

**పలు గ్రామాల్లో కాంగ్రెస్ నేతల పర్యటన**

**వర్ధన్నపేట, డిసెంబర్ 6 (జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట మండల పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం వేడెక్కింది. చెన్నారం, కాశగూడెం, ఉప్పరపల్లి, నల్లబెల్లి గ్రామాల్లో శనివారం పలు రాజకీయ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమూద్ ఆయుబ్ గారు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ గ్రామాల్లో పర్యటిస్తూ అభ్యర్థులకు మద్దతు కోరారు. ప్రచార కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే నాగరాజు గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామ భవిష్యత్తును నిర్ణయించే



ఎన్నికలని, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లగల నాయకత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, గృహ నిర్మాణం, గ్రామీణ రహదారుల అభివృద్ధి, శానిటేషన్ తదితర అంశాల్లో తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్, పంట ప్రోత్సాహకాలు, మహిళలకు బస్సులు ఉచితం, గృహ వినియోగానికి ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ వంటి కొనసాగుతున్న సంక్షేమ కార్యక్రమాల ప్రస్తావన కూడా ఈ సందర్భంగా నాయకులు చేశారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం, రహదారి పనులు, పబ్లిక్ సర్వీస్ సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన విషయాలను ప్రజలకు వివరించారు. ప్రచార కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు, మండల నాయకులు, స్థానిక కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మనువాదుల చెర నుంచి భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

## తొలి విడత పోలింగ్ సన్నద్ధతపై శిక్షణ

**ఎన్నికల మార్గదర్శకాలు తప్పక పాటించాలి**
**జిల్లా పరిశీలకులు బాల మాయాదేవి**



**వరంగల్, డిసెంబర్ 6, 2025(జై భీమ్ న్యూస్)**

తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, పోలింగ్ నిర్వహణలో ఏ రకమైన లోపాలూ చోటుచేసుకోకుండా ఉండేందుకు వరంగల్ జిల్లా ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు వేగవంతం చేసింది. ఈ క్రమంలో వర్ధన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ అధికారులు (పిఓలు), సహాయ పోలింగ్ అధికారులు (ఏపీఓలు) కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను జిల్లా ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పాక్షికతకు తావు లేకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి అధికారి ఎన్నికల నియమ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకుని, వాటిని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. బాల మాయాదేవి ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను సమీక్షించి, దానిపై సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతుండగా, తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న జరగనున్న విషయం ఆమె గుర్తుచేశారు. ఈ పోలింగ్‌కు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, సామగ్రి పంపిణీ వంటి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ జిల్లాలో తొలి విడతలో ఎన్నో గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ, పోటీలో ఉన్న మిగతా గ్రామాల అభ్యర్థుల కోసం ఎన్నికల సంఘం రోజువారీ వినియోగ వస్తువులకు సంబంధించిన ప్రత్యేక గుర్తులను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భనలో వరంగల్ ఆర్డీవో సుమ, జీఎం ఇండస్ట్రియల్ అధికారి నర్సింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ పెట్టినందుకు 15 వేల లంచం డిమాండ్

**డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌ను ఏసీబీ అరెస్ట్**



**హైద్రాబాద్, డిసెంబర్ 6, 2025(జై భీమ్ న్యూస్)**

సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ప్రజలకు న్యాయపరమైన సమాచారం అందించడానికి, అవినీతిని వెలికి తీయడానికి ఉద్దేశించినది. అయితే అదే ఆర్టీఐ కింద సమాచారం కోరిన ఒక రైతుకు 'పేపర్ ఖర్చుల' పేరుతో రూ.15 వేలు లంచం డిమాండ్ చేసిన ఘటన నల్గొండ జిల్లాలో వెలుగుచూసింది. నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం తెరట్పల్లి గ్రామానికి చెందిన ఒక రైతు, తన తండ్రి పేరిట ఉన్న భూమిని అన్యాయంగా ఇతరుల పేర్లకు రిజిస్టర్ చేశారని ఆరోపిస్తూ, అసలు ఆ మార్పు ఎప్పుడు, ఎలా జరిగిందో తెలుసుకోవడానికి ఆర్టీఐ దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఈ దరఖాస్తును పరిష్కరించేందుకు ?15,000 లంచం ఇవ్వాల్సిందేనని, లేదంటే సమాచారం ఇవ్వబోనని డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ రైతును బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో న్యాయం కోసం రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, ఏర్పాటు చేసిన ఉచ్చు ఆపరేషన్‌లో చంద్రశేఖర్ బలాపూర్‌లోని తన నివాసంలో రైతు నుంచి డబ్బు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ అయ్యారు. అధికారులు ఘటన స్థలంలో ఆధారాలను స్వాధీనం చేసుకుని, అతనిపై అవినీతి నివారణ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆర్టీఐ పేరుతో అధికారులే లంచాలు డిమాండ్ చేయడం తీవ్ర ఆగ్రహం రేపుతున్న నేపథ్యంలో, ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## కేయూలో ఉద్యోగుల కోసం ముఖ గుర్తింపు హాజరు విధానం ప్రారంభం



**హన్మకొండ, 6 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగుల హాజరును మరింత పారదర్శకంగా, సులభతరం చేయడానికి "ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) నమోదు ప్రక్రియ"ను అమలు చేయడం ప్రారంభించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కార్యాలయాలు, విద్యా విభాగాలు మరియు అనుబంధ ఆఫీసుల్లో ఈ గుర్తింపు విధానాన్ని నియమిత షెడ్యూల్ ప్రకారం అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రిజిస్ట్రార్ తెలిపిన వివరాల ప్రకారం, డిసెంబర్ 6న మొదటి రోజు చర్యలు చేపట్టి, పరిపాలన భవనం, పరీక్షల విభాగం, ఇంజనీరింగ్ కాలేజీ (కో–ఎడ్యుకేషన్), ఉద్యోగుల ముఖ గుర్తింపు నమోదు విజయవంతంగా నిర్వహించారు. డిసెంబర్ 8 (సోమవారం) కూడా నమోదును కొనసాగించేలా ఏర్పాట్లు చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ కార్యక్రమం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి. రమ, విశ్వవిద్యాలయ నెట్‌వర్కింగ్ సెల్ సంచాలకుడు డాక్టర్ డి. రమేష్ పర్యవేక్షణలో జరుగుతోంది. విశ్వవిద్యాలయ ఉద్యోగుల హాజరు విధానంలో ఇది ఒక ముఖ్యమైన సాంకేతిక పురోగతి అని అధికారులు అభిప్రాయపడ్డారు.

**హనుమకొండలో ఘనంగా బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు**

**హన్మకొండ, డిసెంబర్ 6 (జై భీమ్ న్యూస్)**

భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతిని శనివారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. మహానీయుల జయంతి%-%వర్ధంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ అంకెశ్వరపు రాంచందర్ రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని మనువాద శక్తుల చెర నుంచి రక్షించుకోవడం ప్రతి భారత పౌరుడి కర్తవ్యమని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడం సమాజ అభ్యున్నతికి కీలకమని కమిటీ నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విసికే రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి వర్గం అప్రమత్తంగా ఉండాలని, అంబేద్కర్ చూపిన మార్గమే సామాజిక న్యాయాన్ని సాధించగలదని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్‌ను స్త్రీ%-%పురుష సమానత్వానికి, కుల నిర్మూలనకు, అట్టడుగు



వర్గాల హక్కుల సాధనకు జీవితాంతం పోరాడిన మహానుభావుడిగా అభివర్ణించారు. స్వతంత్ర భారతదేశపు తొలి న్యాయశాఖ మంత్రిగా అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పించేందుకు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారని, ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ వర్గాల హక్కులను రాజ్యాంగంలో స్థిరపరిచిన మహోన్నత నాయకుడు అంబేద్కర్ అని ప్రశంసించారు. అంబేద్కర్ పరమపదించిన ఈ రోజును ఎంతోమంది బహుజన ప్రజలు అంధకార దినంగా భావిస్తున్నారని, ఆయన కలలు కనిన సమాజ నిర్మాణమే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలన, కుల సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన పోరాటాన్ని కొత్త తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు, డివియంసి సభ్యులు సింగారపు రవిప్రసాద్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్, గొసంగి కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మంద మల్లేశం, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునీల్, టిజివిపి రాష్ట్ర నాయకులు మేడ రంజిత్, నాయకులు శ్రీనివాస్, కుమార్, అనిల్, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలంటూ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాలు



**వరంగల్, డిసెంబర్ 6, 2025 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా నిర్వహించేందుకు కావాల్సిన అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన కాజీపేట ఏసీపీ కార్యాలయంను సందర్శించారు. ఉదయం కార్యాలయానికి చేరుకున్న కమిషనర్‌కు అధికారులు పూలమొక్కను అందజేసి ఆతిథ్య స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత కమిషనర్ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, తనిఖీల్లో భాగంగా స్పెషల్ గ్రేవ్, ఎస్టీ – ఎస్సీ కేసులు, పెండింగ్ కేసులుతో పాటు ఇతర కీలక రికార్డులను పరిశీలించారు. కేసుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. చివరిగా కాజీపేట డివిజన్ పోలీస్ అధికారులతో సమావేశమై కమిషనర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో చట్టం – సమాధానాన్ని భంగపరిచే ఏ చర్యనైనా కఠినంగా ఎదుర్కోవాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించే వారిపై ఎలాంటి అలసత్వం వహించవద్దని స్పష్టంగా సూచించారు. ప్రజలు నమ్మకంగా, భయరహిత వాతావరణంలో ఓటు వేసేలా పోలీసులు ముందస్తుగానే బందోబస్తు చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆయన అన్నారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు పుల్యాల కిషన్, సుధాకర్ రెడ్డి, వట్టే చేరాలు, శ్రీధర్ రావు, పులి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు అమల్లో ఎన్నికల కోడ్

**ఏకగ్రీవ గ్రామాల్లోనూ అమల్లోనే జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరీష్**



**హన్మకొండ, 6 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) పూర్తిస్థాయిలో అమల్లో ఉంటుందని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు. మూడు దశల్లో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చివరి దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏకగ్రీవంగా ముగిసిన గ్రామాల్లో కూడా ఎన్నికల కోడ్ తప్పనిసరిగా వర్తించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎవరూ నియమావళిని ఉల్లంఘించకూడదని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో పారదర్శకత, నిబంధనల అమలులో లోపం లేకుండా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ఆమె సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. హనుమకొండ జిల్లాలో డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. చివరి దశ ఫలితాలు వెలువడే వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలులో కొనసాగుతుందని కలెక్టర్ పునరుద్ఘాటించారు.

## పవర్ బిఐ నైపుణ్యాలతో విస్తృత ఉపాధి అవకాశాలు

**కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆచార్య అమరావేణి**





**హన్మకొండ, 6 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

డేటా ఆధారిత యుగంలో బిజినెస్ అనలిటిక్స్ నైపుణ్యాలు అత్యంత కీలకంగా మారాయని, ముఖ్యంగా పవర్ బిఐ వంటి ఆధునిక సాధనాలు విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. అమరావేణి వెల్లడించారు. శనివారం కళాశాల సెమినార్ హాల్‌లో ఎంబీఏ, ఎం.కామ్ కోర్సుల విద్యార్థుల కోసం నిర్వహించిన "స్టూడెంట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆన్ పవర్ బిఐ " కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత కార్పొరేట్ రంగం డేటాను అత్యంత విలువైన వనరుగా భావిస్తోందని, పవర్ బిఐ సహాయంతో విద్యార్థులు సంక్లిష్ట డేటాను అర్థం చేసుకోవడం, వ్యాపార నిర్ణయాలను స్పష్టంగా రూపొందించడం, ముందస్తు అంచనాలు వేయడం, వ్యూహాత్మక ప్రణాళికలు సిద్ధం చేయడం వంటి కీలక నైపుణ్యాలను అలవర్చుకోవచ్చని వివరించారు. ఇవి నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను మరింత విస్తరించగలవని చెప్పారు. కామర్స్ విభాగ డీన్ ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ, మార్కెట్ పూర్తిగా అనలిటిక్స్ స్కిల్స్ పై ఆధారపడుతున్న ఈ తరుణంలో విద్యార్థులు కొత్త సాంకేతికతలను నిరంతరం నేర్చుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రాంగణ నియామకాలలో పవర్ బిఐ వంటి సాధనాలపై పట్టున్న విద్యార్థులకు పెద్దఎత్తున అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థి దండు నవకిరణ్ పవర్ బిఐ పై ప్రాక్టికల్ డెమోలు, రియల్ టైమ్ కేస్ స్టడీలు మరియు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి. వరలక్ష్మి, ఆచార్య ఎస్. నరసింహ చారి, డాక్టర్ ఫణింద్ర కటకం, డాక్టర్ ప్రగతి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కృషి

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్**

**అమరావతి,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే దృఢ సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో, అధునాతన సదుపాయాలు కల్పించి, పోషక ఆహారాన్ని, నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంత్రి నారాలోకేష్ చేస్తున్న కృషికి అభినందనీయమని ప్రశంసించారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసేలా నిర్వహిస్తున్న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్స్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు.

# ఐజేయూ నూతన నేతలను ఘనంగా సత్కరించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు



**వరంగల్, 6 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) తాజా ఎన్నికల్లో పదవులు పొందిన నాయకులను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ, జిల్లా స్థాయి ఐజేయూ ప్రతినిధులను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఇటీవల ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టులు గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, తోట సుధాకర్, సంగోజు రవిలను ఘనంగా అభినందించారు. అలాగే టియూడబ్ల్యూజే %-% ఐజేయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్, కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్ లను కూడా ప్రత్యేకంగా సత్కరించారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన నల్లాల బుచ్చిరెడ్డికు ప్రత్యేక సన్మానం నిర్వహించారు. యూనియన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి - ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య మాట్లాడుతూ "జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల కోసం పటిష్టంగా పనిచేస్తున్న నేతలకు పదవులు రావడం యూనియన్ బలోపేతానికి నిదర్శనం. రాష్ట్రంలో జర్నలిస్టుల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తున్న యూనియన్ టియూడబ్ల్యూజే %-% ఐజేయూ మాత్రమే" అని అభిప్రాయపడ్డారు. అలాగే ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి లిలిబోల్ల అమర్, ఉపాధ్యక్షుడు కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, సభ్యులు ఎండీ నయీంపాషా, విజయరాజ్, ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, నేతలు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, అలాగే సోమనర్సయ్య, రాజేంద్రప్రసాద్, సంపత్ రావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

# వైకల్యం గెలుపునకు అడ్డు కాదు





### భీమారం హైస్కూల్లో ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

**హన్మకొండ, 6 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హసన్ పర్తి మండలంలోని భీమారం హైస్కూల్లో వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఏ. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాలలో విశేష పురోగతి సాధిస్తున్నారని, వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఇడి కో - ఆర్డినేటర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, భీమారంలో భవిత సెంటర్ త్వరలో ప్రారంభం కానున్నదని వెల్లడించారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి సదుపాయాలు అందించేందుకు అన్ని విధాలా చర్యలు చేపడతామని చెప్పారు. వైకల్యం ఎప్పుడూ విజయానికి అడ్డంకి కాదని, సరైన మార్గనిర్దేశం, ప్రోత్సాహం లభిస్తే వారు మరెంతో ముందుకు వెళ్తారని పేర్కొన్నారు. దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బిల్ల మహేందర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లల్లో ఉన్న వైకల్యం కారణంగా నిరుత్సాహానికి లోనుకాకుండా, వారిని ప్రతిరోజూ గమనిస్తూ ప్రోత్సహిస్తే వారి భవిష్యత్తు మరింత వెలుగొందుతుందని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజయం సాధించిన దివ్యాంగ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రముఖ కవయిత్రి మాదారపు వాణిశ్రీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ రామిడి రవీందర్, చింతగట్టు హైస్కూల్ హెడ్ మాస్టర్ పద్మ, ఫిజియోథెరపిస్టు మాధవి, దేవా జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవేందర్, ఐఇడి టీచర్లు మమత, వీరస్వామి తదితరులతో పాటు ఉపాధ్యాయులు జహంగీర్, స్వరూప, సులోచన, సమ్మయ్య, వెంకటేష్, శ్రీను, రమేష్, దేవేందర్ పాల్గొన్నారు.

# షామీర్ పేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ..డ్రైవర్ మృతి

**హైదరాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అలియాబాద్ చౌరస్తా దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అలియాబాద్ నుంచి శామీర్ పేట వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను శామీర్ పేట నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ అదుపు తప్పి రాంగ్ రూట్‌లోకి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆకాష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ధాటికి ట్రాక్టర్ ఇంజన్ రెండు ముక్కలైంది. ఈ ప్రమాదంతో రాజీవ్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపుల కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాక్టర్?ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్?ను క్లియర్ చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అమెరికా ప్రమాదంలో హైదరాబాద్ యువతి మృతి

### శోకసంద్రంలో కటుఉంబ సభ్యులు

**హైదరాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్) :**

అమెరికాలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో తెలుగు యువతి ఉడుముల సహజా రెడ్డి ప్రాణాలు కోల్పోయింది. ఉన్నత చదువుల కోసం నాలుగేళ్ల క్రితం అమెరికా వెళ్లిన ఆమె అనుకోని విధంగా చనిపోయింది. గురువారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల ప్రాంతంలోని గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి, శైలజ భార్యాభర్తలు. జయాకర్ రెడ్డి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శైలజ బచ్చన్నపేట మండలంలో ఎస్జీటీగా పని చేశారు. జయాకర్ కుటుంబం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి సెటిల్ అయింది. జోడిమెట్లలో నివాసం ఉంటోంది. జయాకర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు సహజారెడ్డి 2021లో ఎంఎస్ చదవటం కోసం అమెరికాకు వెళ్లింది. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 13 మంది విద్యార్థులు బర్మింగ్‌హామ్‌లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉంటున్నారు. 13 మందిలో ఉడుముల సహజా రెడ్డి కూడా ఉంది. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకున్న సహజారెడ్డి అక్కడికక్కడే చనిపోయింది. అధికారులు ఆమె మరణ వార్తను జోడిమెట్ల వెంకటాపూర్ రోడ్డులోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటున్న ఆమె తల్లిదండ్రులకు తెలియజేశారు. సహజారెడ్డి మరణ వార్త తెలిసి కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికాలోని భారత ఎంబసీ సహజారెడ్డి మరణంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేసింది. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేసింది. వారితో సంప్రదింపులు జరుపుతోంది. అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది.

# అంబేడ్కర్‌కు సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు సిఎం రేవంత్ ఘనంగా నివాళి అర్పించారు. అండేడ్కర్ వర్ధంతి సందర్భంగా.. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు.



# ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో


**చౌటుప్పల్:జై భీమ్ న్యూస్**



చౌటుప్పల్ మండల గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదటగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన గ్రామీణ వైద్యులు. చౌటుప్పల్ మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు గట్టు సుధాకర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తికి సమాన హక్కులు సమాన అవకాశాలు మరియు సమాన గౌరవం ఉండాలి అని నమ్మి జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన మహా వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు ఆయన చూపిన మార్గం మనకు ఇప్పటికీ ఎప్పటికీ వెలుగునిస్తుందని అజ్ఞానాన్ని జ్ఞానంతో చేయించాలని ఆయన అన్నారు. అన్యాయాన్ని ధైర్యంతో ఎదిరించాలని సమాజాన్ని ఐక్యతతో ముందుకు నడిపించాలని అన్నారు. ప్రతి మనిషిని మనిషిగా గౌరవించాలని ఆయన బోధలు చెబుతున్నాయని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాటలో ప్రతి ఒక్కరు నడవాలని సుధాకర్ అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నలపరాజు లింగయ్య, జోనల్ అధ్యక్షులు బొమ్మిడి సత్తిరెడ్డి, గౌరవాధ్యక్షులు గంగాపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొంగరి ప్రసాద్ కందగట్ల నరసింహ, పరమేష్ మైలారం ఉదయ్ తదితర గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, కాళోజి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రమేష్ రెడ్డి, ఐఏఎస్ శరత్





**వరంగల్, 6 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి ఆలయం శనివారం ప్రముఖుల సందర్శనతో రద్దీగా మారింది. శనివారం ఉదయం నుండి సాయంకాలం వరకు పలువురు నాయకులు, ఉన్నతాధికారులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, అలాగే కాళోజి హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రమేష్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంకాలం శరత్, ఐఏఎస్ ౹ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రైబల్ వెల్ఫేర్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ వేద పండితులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఖాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి వేడుక




**ఖాజీపేట, 6 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

మజ్దూర్ యూనియన్ రైల్వే శాఖ, ఖాజీపేటలో భారత రత్న, రాజ్యాంగ శిల్పి డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ 79వ వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ బన్నా అయిలయ్య డాక్టర్ అంబేద్కర్ జీవిత సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలు మరియు సమాజానికి ఆయన అందించిన సేవల గురించి విశేషంగా మాట్లాడారు. దేశ నిర్మాణంలో అంబేద్కర్ చూపిన దిశాబలం ప్రతి తరానికి ప్రేరణ అని తెలిపారు. కార్యక్రమ వేదికపై మాజీ ఎమ్మెల్యే మార్టినేని ధర్మా రావు, యూనియన్ ప్రెసిడెంట్ రవీందర్, రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్ని రవీందర్ తదితరులు ఆసీనులుగా పాల్గొన్నారు. అతిథులు అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. యూనియన్ సభ్యులు, సిబ్బంది, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహానటి సావిత్రికి మరణం లేదు

**చిత్ర పరిశ్రమలో ఆమె చరిత్ర చిరసస్థాయి**
**అలాంటి నటులు నేడు లేరు..రారు**
**మంచి సినిమాలు తీస్తే అంతా ఆదరిస్తారు**
**సావిత్రి మహోత్సవంలో వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్) :**

మహానటి సావిత్రికి మరణం లేదని, ఆమె చరిత్ర అజరామరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. చిత్రపరిశ్రమ ఉన్నంత వరకు ఆమె జీవిస్తూనే ఉంటుందని అన్నారు. 'మహానటి' సావిత్రి 90వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన అనేక విషయాలపై మాట్లాడారు. మహానటిగా ప్రేక్షకాభిమానం సొంతం చేసుకున్న సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తున్నా. 'సావిత్రి మహోత్సవం' అని ఈ కార్యక్రమానికి మంచి పేరు పెట్టారు. సావిత్రి జీవితం నుంచి ఎన్నో విషయాలు నేటితరం నేర్చుకోవచ్చు. నటిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం ఆమె పాటుపడ్డారు. కంటితో కోటి భావాలు, నవరసాలు పలికించే ఆమె నటన అద్భుతం అన్నారు. ప్రస్తుతం అలాంటి నటీమణులు లేరు. ఈ విషయం చెప్పడానికి నాకు ఏ సంకోచం లేదు. నేటి సినిమాల్లో కథానాయికకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. కుటుంబ విలువలు ఉన్న సినిమాలు రావడం లేదు. అభినయం ప్రదర్శించే కథానాయికలను వేళ్ల మీద లెక్క పెట్టి చెప్పవచ్చు. ప్రస్తుతం ఒకరిద్దరు అలాంటి నటీమణులు ఉన్నా, వారికి తగిన అవకాశాలు రావడం లేదు. సినీ ప్రముఖులు ఈ దిశగా ఆలోచించాలని వెంకయ్యనాయుడు సూచించారు. అలాగే మంచి సినిమా తీస్తే తనతో సహా అందరూ ఆదరిస్తారని, ఈ ప్రపంచంలోనే అత్యంత చవకైన వినోదం సినిమా మాత్రమేనని వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు సాహిత్యంలో ఉన్న ఎన్నో కథలను దర్శక-నిర్మాతలు ధారావాహికల రూపంలో నేటి తరానికి అందించాలని కోరారు. ఈటీవీ విన్ 'కథాసుధ' పేరుతో చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సినిమా వ్యాపారమే అయినా, అది కళాత్మకమని నిర్మాతలు గుర్తు పెట్టుకోవాలన్నారు.. 'మహానటి' మూవీని అద్భుతంగా తీశారు. అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్‌కు నా అభినందనలు. ఆ సినిమా చూస్తుంటే పాత రోజులన్నీ గుర్తు వస్తాయి. ప్రతి నిర్మాత ఇలాగే ఆలోచించాలి. మనవైన కథలు ఎన్నో ఉన్నాయి. మంచి సినిమా ఉంటే నాతో సహా అందరూ చూస్తారు. దగ్గుబాటి రానా నిర్మించిన '35: చిన్న కథ కాదు', దిల్‌రాజు కుమార్తె హన్షిత నిర్మించిన 'బలగం', కొణిదెల నిహారిక 'కమిటీ కుర్రాళ్ళు', సుకుమార్ కుమార్తె సుప్రీతి 'గాంధీతాత చెట్టు' ఇలా ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడంతో పాటు, అవార్డులు సొంతం చేసుకున్నాయన్నారు. మన జీవనంలో అత్యంత చౌకగా లభించే వినోదం సినిమా. అప్పటి సినిమాల్లో హీరో-హీరోయిన్ ఒకరినొకరు తాకకుండా శృంగారాన్ని పండించేవారు. ఇప్పుడు తాకిన, గోకినా ఏం జరగడం లేదు. అంత తేడా వచ్చేసింది. సావిత్రిలాంటి నటికి మరణం లేదు. ఆమె మంచితనం కూడా చిర యశస్సు అందించింది. సినిమా వినోదం పాటు, సందేశానికీ ప్రాముఖ్యత ఇవ్వాలి. సందేశాత్మక సినిమాలు ఎవరు చూస్తారని అందరూ అనుకుంటున్నారు. రామోజీరావుగారు తీసిన సందేశాత్మక సినిమాలు ఆడలేదా? నేటి దర్శక-నిర్మాతలు ఆ అభిప్రాయాన్ని మార్చుకుని, కళాత్మక సినిమా తీయాలని కోరుకుంటున్నాఅని వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి తదితర నటులు, సావిత్రి కూతురు విజయచాముండేశ్వరి పాల్గొన్నారు.

## గతంలో ఎవిరనైనా దగ్గరకు రానిచ్చావా కెసిఆర్?

ఇప్పుడేమో సర్పంచ్‌లను, వార్డు మెంబర్లపై ప్రేమ
పదేళ్లు దోచుకున్నది చాలదా..మళ్లీ దోచుకుందామనా
బిఆర్‌ఎస్‌కు కెటిఆర్ అతి పెద్ద శత్రువు
దేవరకొండ సభలో కెసిఆర్‌పై రేవంత్ విమర్శలు

**నల్లగొండ,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ కు మీ కొడుకు కేటీఆరే గుదిబండ అని.. కేటీఆర్ ఉన్నంత కాలం బీఆర్ఎస్ ను బొందపెడుతూనే ఉంటారని కెసిఆర్‌ను ఉద్దేశించి సిఎం అన్నారు. దేవరకొండ బహిరంగ సభలో మాట్లాడిన రేవంత్.. ఇద్దరు సర్పంచులను, వార్డు మెంబర్లను కేసీఆర్ పిలిపించుకుని మాట్లాడారని.. గతంలో కేసీఆర్ ఎవరితోనైనా మాట్లాడేవారా అని ప్రశ్నించారు. మళ్లీ మనదే రాజ్యం అంటున్నారని, ఇష్టపిదాకా దోచుకున్నది చాలలేదా కెసిఆర్ అని విమర్శించారు. పదేళ్లలో గడీలు కట్టుకుని ప్రజలకు దూరంగా ఉన్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు కూడా అపాయింట్ మెంట్ ఇవ్వని కేసీఆర్.. ఇపుడు సర్పంచ్ లను,వార్డు మెంబర్లను పిలిచి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఒకప్పుడు కేసీఆర్ ఎంతో ఘనంగా బతికారని.. వాళ్ల ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్ మెంట్ ఇచ్చేవాడు కాదన్నారు...మంత్రులను గేట్ దగ్గరి నుంచే పంపించేవారని చెప్పారు. తాము అధికారం చేపట్టాక నిలువ నీడలేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ ఎవరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని..ఇందిరమ్మ ఇండ్ల కోసం 22500 కోట్ల ఖర్చుచేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పదెకరాల్లో 150 కోటల గడీ కట్టుకున్నారు కానీ..పేదవాడికి ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేదని చెప్పారు. 200యూనిట్ల ఉచిత కరెంట్ ఇవ్వడంతో పేదల ఇంట్లో వెలుగులు నిండాయన్నారు. పేదవాళ్ల పట్ల కేసీఆర్‌కు అభిమానం లేదన్నారు. మంచిరోజులొస్తాయంటున్నారని.. తెలంగాణను పీక్కతిన్న మీ ఆకలి తీరలేదా?. 8లక్షల కోట్ల అప్పులు చేసిన ఆకలి తీరలేదా అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. ఆనాడు చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ప్రజాపాలనలో అడిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో అత్యధిక రేషన్ కార్డులు దేవరకొండలోనే ఉన్నాయని తెలిపారు., కొత్త రేషన్ కార్డులతో పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా చేశామన్నారు. 3కోట్ల తెలంగాణ ప్రజలు సన్నబియ్యం తింటున్నారని చెప్పారు. పేదల ఆకలి తీరినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని అన్నారు.

## గాంధీ నెహ్రూలపై దుష్ప్రచారం

**విషప్రచారం చేసతున్న బిజెపి**
**మండిపడ్డ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి**

**హైదరాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ టార్గెగా బీజేపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూలపై విష ప్రచారం చేయాలని మొదటి నుంచి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గాంధీపై బీజేపీ నాయకులు విషప్రచారం చేస్తుంటే బీజేపీ నేతలపై ప్రజలు తిరగబడుతున్నారని.. దీంతో గాంధీనీ కాకుండా ఇప్పుడు నెహ్రూపై విష ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజల్లోకి బ్యాంక్ సేవలు తీసుకువచ్చిందే ఇందిరాగాంధీ అని గుర్తు చేశారు. చరిత్రను రూపుమాపాలని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'నెహ్రూ కుటుంబం ఎప్పుడూ కుట్రా రాజకీయాలు చేయలేదు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసమే నెహ్రూ కుటుంబం పని చేసిందన్నారు. దేశ ప్రజలు స్వేచ్ఛగా ఉండాలని నెహ్రూ కుటుంబం శాంతియుత పోరాటం చేసి స్వాతంత్ర్యం తీసుకువచ్చారు. స్వాతంత్ర్యం తీసుకువచ్చింది గాంధీనే.. ఇది చరిత్ర.. దీనిని ఎవరూ మార్చలేరు. అప్పుడు బీజేపీ లేదు కదా అందుకే నెహ్రూ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారు. నెహ్రూ ప్రధాని కావాలని స్వాతంత్ర్యం పోరాటం చేయలేదు. నెహ్రూ ప్రధానిగా ఉండాలని ప్రజలు కోరుకున్నారు. ఆయన ప్రధాని అయిన తర్వాత ప్రణాళిక బద్దంగా ఆర్థిక పురోగతికి ప్రాధాన్యం ఇచ్చారని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. 'లౌకిక వాదాన్ని నెహ్రూ విశ్వసించేవారని.. వారి త్యాగాలను మరిపించడానికి బీజేపీ నేతలు చెడు ప్రచారం చేస్తున్నారు. రాహుల్ గాంధీ కుటుంబంపై కావాలని బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. స్వాతంత్యం÷-ర వచ్చిన తర్వాత ప్రధానిగా దేశంలో నెహ్రూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అప్పుడు ప్రజలు ఏక తీర్మానంతో నెహ్రూను ప్రధానిగా ఉండాలని చెప్పారు. ఇప్పుడు రెండు పర్యాయాలు ఓటింగ్ మిషన్‌లు తమంతట తాము ఓటు వేసుకున్నాయి. అందుకే బీజేపీ అధికారంలోకి వస్తోంది. స్వాతంత్యం÷-ర వచ్చిన రోజుల్లో నెహ్రూ హయాంలో ఆకలి చావులు లేకుండా చేశారు. తాగు, సాగు నీరు ప్రజలకు అందించడం కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులను నెహ్రూ నిర్మించారు' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాల కౌటాలలో పులి అడుగులు

**గుర్తించి అటవీ అధికారులకు సమాచారం**

**ఆదిలాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులోని వార్ధా నదిలో పులి అడుగులను స్థానికులు గుర్తించారు. మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా థరూర్ గ్రామ సమీపంలోని వార్ద నదిలో పులి అడుగులను స్థానికులు గుర్తించి మహారాష్ట్ర అటవీ అధికారులకు సమాచారం అందించారు. మహారాష్ట్ర అటవీ అధికారులు పులి అడుగులను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశారు. అడుగులు వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో స్పందించి కౌటాల సెక్షన్ అటవీ అధికారులు తులసీరాం, శ్రీదేవిలు వార్ధా నది పరిసరాలను పరిశీలించారు. తెలంగాణ వైపు పులి అడుగులు లేనప్పటికీ ప్రజలను అప్రమత్తం చేశారు. తాటిపల్లి గ్రామంలో చాటింపు వేయించారు.రైతుల చేన్లలో వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పులి అనవాళ్లు కనిపించినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు.

## సింహాచంలో మంత్రి అనిత పూజలు





**సింహాచలం,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

శ్రీ వరాహలక్ష్మి నరసింహ స్వామివారిని ఏపీ హోం మంత్రి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో హోం మంత్రికి దేవాలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆలయాల పరిరక్షణ, ప్రక్షాళనకు నడుంబిగించినట్లు చెప్పారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించామని, లక్షల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని చెప్పారు. రాబోయే ప్రధాన ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## ఆర్ఎసెస్ తరహాలో టిడిపి కేడర్ పనితీరు

**పార్టీకి నిస్వార్థంగా కృషి చేసేలా సిద్ధం కావాలి**
**పార్టీ ముఖ్యనేతలతో చంద్రబాబు సమీక్ష**

**అమరావతి,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

బీజేపీకి ఆర్ఎస్ఎస్ లాగా తెలుగు దేశం పార్టీకి పార్టీ కేబర్ పనిచేయాల్సి ఉందిన టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎలాంటి పదవులు ఆలోచించ కుండా ఆర్ఎస్ఎస్ నిస్వార్థంగా పనిచేస్తోందని ప్రస్తావించారు. అదే తరహాలో మన ఐడియాలజీ ప్రకారం పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. పలు కీలక సమీక్షలు, వన్ టు వన్ భేటీల ద్వారా దాదాపు అందరి ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. మరో 37మంది ఎమ్మెల్యేల పనితీరు మరింత మెరుగుపడాల్సి ఉందని సూచించారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో ఉన్న నేతలతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపై నేతలకు దిశానిర్దేశర చేశారు. ప్రతీ ఒక్కరి పనితీరుపైనా నాలుగైదు మార్గాల్లో ఖచ్చితమైన సర్వే నివేదికలు తెప్పించుకుంటున్నానని పేర్కొన్నారు. స్కూల్ ఇన్నోవేటివ్ పార్టనర్‌షిప్ సమ్మిట్ పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడదామని సూచించారు సీఎం చంద్రబాబు.విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిద్దామని తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు గంటల పాటు మీడియా సమావేశం పెట్టిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చారు నేతలు. నెలకోసారి వచ్చి విజ్ఞత కోల్పోయి మాట్లాడేవారి మాటలకు విలువ లేదని ఎద్దేవా చేశారు. ప్రజలే వారికి బుద్ధి చెబుతారని తెలిపారు జగన్ మాట్లాడే అర్థం పర్థం లేని మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## మృతిచెందిన అయ్యప్ప భక్తులు విజయనగరం వాసులు

**ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రులు అనిత, మండిపల్లి**

**విజయనగరం,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

తమిళనాడులోని రామేశ్వరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు విజయనగరం జిల్లా వారుగా గుర్తిచారు. ఈ ఘటనపై జిల్లాలో విషాదం అలముకుంది. రోడ్డు ప్రమాదంలో విజయనగరం వాసుల మృతి పట్ల హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను త్వరితగతిన కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా వాసుల మృతి పట్ల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవ దర్శనానికి వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం జరగడం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. తమిళనాడు రామేశ్వరం రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన అయ్యప్ప భక్తులు కారు ఆపి నిద్రిస్తుండగా డీఎంకే నేతకు చెందిన మరో కారు వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురు అయ్యప్ప భక్తులు, డీఎంకే కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని చికిత్స నిమిత్తం రామనాథపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో అయ్యప్ప భక్తుడు మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. వీరంతా శబరిమలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ముగ్గురిని ఏపీలోని విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస వాసులుగా గుర్తించారు. మరొకరిని గజపతినగరం మండలం మరుపల్లివాసిగా గుర్తించారు.

## నెల్లూరు ఇంకా కోలుకోని పరిస్థితి

**నెల్లూరు,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

దిత్వా తుపాను ప్రభావంతో నెల్లూరు జిల్లా ఇంకా తేరుకోలేద. పలు ప్రాంతాలు ఇంకా జలదిగంబంధనంలోనే ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలు ఇప్పటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం కలుజుపై వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నీటి ప్రవాహానికి కలుజు పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి సైతం కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన అధికారులు.. యుద్ధ ప్రాతిపదికన మట్టికట్టకు మరమ్మతులు చేపట్టారు.

## హెరిటేజ్, భారతి సిమెంట్‌లను ఎపికి తరలించండి

**బాబు, జగన్‌లకు ఉండవల్లి సూచన**

**రాజమహేంద్రవరం,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబు తన వ్యాపారాలను ఎందుకు హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం లేదని మాజీ ఎంపీ ఉండవల్లి ప్రశ్నించారు. చంద్రబాబు హెరిటేజ్ సంస్థ కార్యాలయాన్ని, జగన్ భారతి సిమెంట్స్‌ను తెలంగాణ నుంచి ఏపీకి తీసుకురావాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబులది రాజకీయ స్నేహం మాత్రమేనని.. వారి మనస్సులు ఎప్పుడూ కలవవని విమర్శించారు.కోనసీమ కొబ్బరికి తెలంగాణ నేతల దిష్టి తగిలిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల వ్యాఖ్యానించారు. అయితే, పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఉండవల్లి అరుణ్ కుమార్ స్పందించారు. కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని పవన్ వ్యాఖ్యానించడం సరికాదని హితవు పలికారు. ఉప ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదని అన్నారు. ఏపీకి ముఖ్యమంత్రి అవుతాడని తాను నమ్మిన పవన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని చెప్పుకొచ్చారు. శనివారం రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడారు ఉండవల్లి అరుణ్ కుమార్. ఈరోజు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి అని తెలిపారు. ప్రభుత్వానికి అపరిమిత హక్కులు కల్పించి ప్రజలు మౌనంగా ఉన్నప్పుడు దేశానికి పతనం మొదలవుతోందని అంబేడ్కర్ చెప్పారని గుర్తుచేశారు. ఏపీలో అధికార, ప్రతిపక్షాలు మోదీకి అనుకూలంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. పాంచజన్యం పుస్తకం చదివిన తర్వాత ఆర్ఎస్ఎస్‌లో నుంచి తాను బయటకు వచ్చానని స్పష్టం చేశారు. హిందూమతంపై 1964లో ఒక జడ్జిమెంట్ ఇచ్చారని ప్రస్తావించారు. హిందుత్వం అనేది మతం కాదని.. సనాతన ధర్మమని వివరించారు. బీజేపీ నేతలు రాజకీయం కోసం హిందూ మతాన్ని వాడుకుంటున్నారని విమర్శలు చేశారు. నార్త్ తరహాలో ఏపీలో బీజేపీ ఎప్పుడూ బలపడదని పేర్కొన్నారు. భారత్‌లో అమాయకుల జోలికి వచ్చే పాకిస్థాన్ టెర్రరిస్టులను కాల్చి పడేయాలని ఉండవల్లి అరుణ్ కుమార్ హెచ్చరించారు.

# విపరీతంగా పెరిగిన విమాన టికెట్ల ధరలు

**సొమ్ము చేసుకుంటున్న విమానయాన సంస్థలు**
**ధరలపై గగ్గోలు పెడుతున్న ప్రయాణికులు**

**న్యూఢిల్లీ,డిసెంబర్6(జై భీమ్ న్యూస్):**

దేశీయ విమానయాన రంగంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న గందరగోళం శుక్రవారం మరింత తీవ్రరూపం దాల్చింది. ఇండిగోకు చెందిన వందలాది విమాన సర్వీసుల రద్దు కావడంతో ఎదురైన పరిస్థితిని ఇతర విమానయాన సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రయాణికులను తీవ్రంగా దోచుకుంటున్నాయి. టికెట్ ధరలను భారీగా పెంచేశాయి. సాధారణ ధరల కంటే ఏకంగా 3 నుంచి 10 రెట్లు అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారికి ఇది పెనుభారంగా మారింది. ప్రధాన నగరాల మధ్య ఒక్కరోజు ప్రయాణానికి సంబంధించిన టికెట్ ధరలు ఆకాశాన్ని తాకాయి. శుక్రవారం నాటి ధరలను పరిశీలిస్తే ఢిల్లీ - బెంగళూరు విమాన టికెట్ ధర రూ. 1,02,000గా నమోదు కాగా.. చెన్నై - ఢిల్లీ మార్గంలో టికెట్ ధర రూ. 90,000కు చేరింది. అదేవిధంగా ఢిల్లీ - ముంబైకి ఒక టికెట్ ధర ఏకంగా రూ. 54,222 పలికింది. ఇతర విమానయాన సంస్థల టికెట్ల ధరలు కూడా రూ. 20 వేల నుంచి రూ. 40 వేల మధ్యలో కొనసాగుతున్నాయి. ముంబై - శ్రీనగర్ మార్గంలో సాధారణంగా రూ. 10 వేల లోపు ఉండే టికెట్ ధర, ఇప్పుడు రూ. 62,000కు పెరిగింది. రౌండ్ ట్రిప్ తీసుకుంటే దాదాపు రూ. 92 వేల వరకు ఉంటోంది. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించాలనుకునే వారికి కూడా అధిక ధరల సెగ తగిలింది. శనివారం నాటి ప్రయాణానికి ఢిల్లీ–హైదరాబాద్ ఎయిరిండియా విమాన టికెట్ ధర రూ. 33,000కు చేరుకుంది. సాధారణ రోజుల్లో ఈ మార్గంలో టికెట్ ధర కేవలం రూ. 5,000 నుంచి రూ. 7,000 మధ్య మాత్రమే ఉంటుంది. రాబోయే రోజుల్లో కూడా పరిస్థితి మెరుగుపడే సూచనలు కనిపించడం లేదు. డిసెంబర్ 7వ తేదీన ఢిల్లీ–చెన్నై ఎకానమీ క్లాస్‌లో కనీస టికెట్ ధర రూ. 53,000గా, ఢిల్లీ–హైదరాబాద్ కనీస ధర రూ. 25,000గా నమోదైంది. ఈ భారీ పెరుగుదల కారణంగా ప్రయాణాలు అత్యవసరం కానివారు తమ ప్రణాళికలను వాయిదా వేసుకుంటున్నారు. విమాన సర్వీసుల రద్దుపై ఇండిగో సంస్థ ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. ఈ సంక్షోభంపై సోషల్ మీడియా వేదికగా వివరణ ఇస్తూ, “క్షమించండి... మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటాం” అని ప్రయాణికులకు సందేశం పంపింది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటుడు సోనూ సూద్ స్పందిస్తూ, విమానాశ్రయాల్లోని ఇండిగో సిబ్బంది పట్ల దయతో మెలగాలని ప్రయాణికులను కోరారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. విమానం ఆలస్యమైతే కలిగే అసహనాన్ని తాను అర్థం చేసుకోగలనని, అయితే ఆ కోపాన్ని సిబ్బందిపై చూపించడం సరికాదని సోనూ సూద్ హితవు పలికారు. “దయచేసి ఇండిగో సిబ్బంది పట్ల దయగా, వినయంగా ఉండండి. విమానాల రద్దు భారాన్ని వారు కూడా మోస్తున్నారు. వారికి మనం మద్దతుగా నిలుద్దాం” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఇండిగో సమస్యల వల్ల తన కుటుంబ సభ్యులు కూడా ఎయిర్‌పోర్టులో దాదాపు 8 గంటల పాటు చిక్కుకుపోయారని సోనూ సూద్ వెల్లడించారు. “అక్కడ ప్రయాణికులు సిబ్బందిపై ప్రదర్శిస్తున్న కోపం, ఆగ్రహం చూసి చాలా బాధేసింది. వారిని తిడుతున్నారు, దుర్భాషలాడుతున్నారు. ఇది చాలా తప్పు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కౌంటర్ వద్ద నిల్చున్న ఉద్యోగి విమానం రద్దుకు లేదా ఆలస్యానికి కారణం కాదని గుర్తుచేశారు. “ఆ సిబ్బంది కూడా మనలాంటి ఉద్యోగులే. వారు కూడా గంటల తరబడి తిండి, నీళ్లు లేకుండా అందరి కోపాన్ని భరిస్తున్నారు. దయచేసి ప్రశాంతంగా, చిరునవ్వుతో మాట్లాడండి. సహకరిస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి” అని సూద్ విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో, “ఇండిగో, దయచేసి ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించండి. చాలా మంది ఇబ్బంది పడుతున్నారు” అంటూ సంస్థ యాజమాన్యాన్ని ఆయన కోరారు.



# డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు

**నేషనల్ హెరాల్డ్ కేసులో దర్యాప్తు**

**న్యూఢిల్లీ,డిసెంబర్6(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నేషనల్ హెరాల్డ్ కేసులో మరోసారి ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. కేసులోని కొన్ని ఆర్థిక విషయాలు, లావాదేవీలపై వివరణ ఇవ్వాలని నోటీసులో కోరారు. విచారణకు హాజరు కావాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు చాలాకాలంగా నడుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు విచారణ ఎదుర్కొన్నారు. ఇదే కేసులో భాగంగా గతంలో కూడా డీకే శివకుమార్‌ను ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు ప్రశ్నించాయి. తాజాగా ఆర్థిక నేరాల విభాగం పోలీసులు పంపిన నోటీసులతో ఈ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. కేసు విచారణలో భాగంగా కొన్ని కీలకమైన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి డీకే శివకుమార్ నుంచి సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నోటీసులపై శివకుమార్ ఎలా స్పందిస్తారు, విచారణకు ఎప్పుడు హాజరవుతారనేది ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామం కర్ణాటక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# వివాహ వయస్సు రాకున్నా సహజీవనం చేయొచ్చు..

**రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు**

**రాజస్థాన్, డిసెంబర్6(జై భీమ్ న్యూస్):**

యువతీయువకుల సహజీవనం విషయంలో రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివాహ వయస్సు రాకున్నా సరే యువతీయువకులు మేజర్లయితే పరస్పర ఆమోదంతో సహజీవనం చేయొచ్చని స్పష్టం చేసింది. వివాహ వయస్సు రాలేదన్న కారణంగా రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా హక్కును కాదనలేమని పేర్కొంది. ఈ మేరకు 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడి సహజీవనం కేసులో కోర్టు ఈ తీర్పు వెలువరించింది. యువకుడికి వివాహ వయస్సు రాలేదన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. యువతి కుటుంబ సభ్యుల నుంచి హాని ఉందన్న యువకుడి ఆందోళన నేపథ్యంలో ఆ జంటకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. రాజస్థాన్ హైకోర్టులో 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడు ఓ పిటిషన్ దాఖలు చేశారు. తామిద్దరమూ పరస్పర అంగీకారంతో సహజీవనం చేస్తున్నామని అందులో పేర్కొన్నారు. అయితే, యువతి కుటుంబం దీనిని వ్యతిరేకిస్తూ తమను చంపేస్తామని బెదిరిస్తోందని, తమకు రక్షణ కల్పించాలని యువకుడు కోర్టుకు విజ్ఞప్తి చేశాడు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ జంట ఆరోపించింది. ఈ జంటలో యువకుడికి వివాహ వయస్సు (21 ఏళ్లు) రాలేదని, సహజీవనం కొనసాగించేందుకు అనుమతి ఇవ్వకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు విన్నవించారు. అయితే పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు కొట్టివేసింది. పెళ్లి వయస్సు రాలేదనే కారణంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన స్వేచ్ఛా హక్కును హరించలేమని పేర్కొంది. భారతీయ చట్టాల ప్రకారం సహజీవనాన్ని నిషేధించలేమని.. దీనిని నేరంగా కూడా చూడలేమని జస్టిస్ అనూప్ ధండ్ స్పష్టం చేశారు.

# పురుషుడిపై మహిళ అత్యాచారం

**మహారాష్ట్రలో విచిత్ర ఘటన**

**పూణె, డిసెంబర్6(జై భీమ్ న్యూస్):**

మహారాష్ట్రలో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ పురుషుడికి మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, తనను పెళ్లి చేసుకోకుంటే రేప్ కేసు పెడతానంటూ ఓ మహిళ బెదిరించిన ఘటన పూణెలోని కోత్రుడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ముంధ్వా ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల వ్యక్తికి, కోత్రుడ్‌కు చెందిన 38 ఏళ్ల మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానని ఆమె నమ్మబలికింది. బాధితుడిపై అతని భార్య పెట్టిన కేసులో న్యాయసహాయం చేస్తానని చెప్పి అతనికి దగ్గరైంది. ఈ క్రమంలో, అతనికి మత్తుమందు ఇచ్చి వేర్వేరు ప్రదేశాలకు తీసుకెళ్లి మూడుసార్లు అత్యాచారం చేసినట్లు బాధితుడు తన ఫిర్యాదులో ఆరోపించాడు. ఆ తర్వాత, నిందితురాలు తనను వివాహం చేసుకోవాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చింది. అతను అందుకు నిరాకరించడంతో, “నన్ను పెళ్లి చేసుకో, లేదా రూ. 2 లక్షలు ఇవ్వు. లేకపోతే నీపై అత్యాచారం కేసు పెట్టి జైలుకు పంపిస్తాను” అని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నితీశ్ కుమార్

**పాట్నా, డిసెంబర్6(జై భీమ్ న్యూస్):**

బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో, ఆయన పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి, తమ జాబితాలో చేర్చింది. ఈ మేరకు సదరు సంస్థ నితీశ్ కుమార్‌కు ప్రత్యేకంగా అభినందన లేఖను పంపింది. ఒకే వ్యక్తి ఒక రాష్ట్రాన్ని పదిసార్లు పాలించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అరుదైన ఘనత అని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన లేఖలో పేర్కొంది. “1947 నుంచి 2025 మధ్య కాలంలో పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తొలి వ్యక్తిగా నిలవడం భారతదేశానికి గర్వకారణం. ఇది మీ అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. బీహార్ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసానికి ఈ అసాధారణ విజయం తార్కాణం” అని ప్రశంసించింది. సుపరిపాలన, అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నితీశ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆ సంస్థ కొనియాడింది. ఆయన నాయకత్వ పటిమ వల్లే పదేపదే ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించింది. ఈ అరుదైన గౌరవం దక్కడంతో నితీశ్ కుమార్‌కు పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ఉగ్రవాదుల చెరలో భువనగిరి యువకుడు

**ఆఫ్రికాలోని మాలిలో ఘటన**

**హైదరాబాద్,డిసెంబర్6(జై భీమ్ న్యూస్):**

ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశానికి వెళ్లిన యాదాద్రి భువనగిరి జిల్లా యువకుడు ప్రవీణ్ ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్నాడు. గత నెల 23న విధులు ముగించుకుని వస్తుండగా %జీచీ×వీ% ఉగ్రవాద సంస్థకు చెందిన దుండగులు కిడ్నాప్ చేశారు. దీంతో అతడి తల్లిదండ్రులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారత ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఉపాధి కోసం జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టిన ఊరును వదిలి విదేశాలకు వెళ్లిన ఓ యువకుడు ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బండసోమారం గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడిని ఆఫ్రికాలో ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర ఆందోళనను సృష్టించింది. తమ బిడ్డ ఎలా ఉన్నాడోనని తల్లి మహేశ్వరి, తండ్రి జంగయ్య తల్లడిల్లుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన నల్లమాస జంగయ్య, మహేశ్వరి దంపతుల రెండో కుమారుడు ప్రవీణ్ ఉపాధి కోసం గతేడాది నవంబరులో ఒక బోర్‌వెల్ కంపెనీ తరఫున ఆఫ్రికాలోని మాలి దేశంలోని కోబ్రి ప్రాంతానికి వెళ్లారు. ఎంత పనిలో ఉన్నా.. ప్రవీణ్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల సమయంలో తప్పనిసరిగా తల్లిదండ్రులతో మాట్లాడేవాడు. అయితే గత నెల 22న చివరిసారిగా ఇంటికి కాల్ చేసిన ప్రవీణ్.. మరుసటి రోజు నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ప్రవీణ్ కిడ్నాప్ అయిన విషయాన్ని బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు డిసెంబర్ 4 అతని తల్లిదండ్రులకు ఫోన్ చేసి ధ్రువీకరించారు. గత నెల 23న ప్రవీణ్ విధులు ముగించుకుని తాను ఉంటున్న గది వద్దకు వెళ్తుండగా.. జేఎన్ఐఎం (%జీచీ×వీ%) అనే ఉగ్రవాద సంస్థకు చెందిన దుండగులు అతడిని కిడ్నాప్ చేశారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అంతకుముందు కూడా అదే ప్రాంతంలో ఆ సంస్థ కొంతమంది విదేశీయులను కిడ్నాప్ చేసినట్లు సమాచారం. ఈ ఘటన గురించి తెలుసుకున్న బండసోమారం గ్రామ ప్రజలు, ప్రవీణ్ కుటుంబ సభ్యులకు కన్నీటి పర్యంతమవుతున్నారు. అతని క్షేమం గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రవీణ్ ఆచూకీ కోసం బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు ఢిల్లీలోని భారత రాయబార కార్యాలయం అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రవీణ్‌ను సురక్షితంగా విడిపించేందుకు భారత ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ విజ్ఞప్తి చేస్తున్నారు. విదేశీ గడ్డపై ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్న తమ బిడ్డను త్వరగా స్వదేశానికి తీసుకురావాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. మాలిలో ఉగ్రవాదం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో.. ప్రవీణ్ త్వరగా క్షేమంగా తిరిగి వస్తాడనే ఆశతో బండసోమారం గ్రామం మొత్తం ఎదురుచూస్తోంది.

# విమానాల రద్దుపై సుప్రీంలో పిటిషన్

**మానవతా సంక్షోభం నెలకొందని పిల్**
**తక్షణమే జోక్యం చేసుకోవాలని కోర్టుకు అభ్యర్థన**

**న్యూఢిల్లీ,డిసెంబర్6(జై భీమ్ న్యూస్):**

ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో నెలకొన్న సంక్షోభంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత కొన్ని రోజులుగా 1,000కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో తక్షణమే న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ‘ఇండిగో ఆల్ ప్యాసింజర్ అండ్ అనదర్’ పేరుతో న్యాయవాది నరేంద్ర మిశ్రా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. విమానాల రద్దు, తీవ్ర జాప్యం కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో ‘మానవతా సంక్షోభం’ తలెత్తిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వృద్ధులు, పసిపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారితో సహా వేలాది మంది ప్రయాణికులు ఆహారం, నీరు, విశ్రాంతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పౌరుల జీవించే హక్కు (ఆర్టికల్ 21)కు తీవ్ర విఘాతం కలిగించడమేనని తెలిపారు. పైలట్ల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన విమాన డ్యూటీ సమయ పరిమితి నిబంధనల అమలులో ప్రణాళిక లోపం వల్లే ఈ అంతరాయాలు ఏర్పడ్డాయని ఇండిగో బహిరంగంగా అంగీకరించింది. అయితే, ఈ మార్పులను ముందుగా అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడంలో ఇండిగోతో పాటు డీజీసీఏ కూడా విఫలమయ్యాయని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కీలక మార్గాల్లో టికెట్ ధరలను రూ.50,000 వరకు పెంచి ప్రయాణికులను బందీలుగా మార్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విమానాల రద్దు వల్ల చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఇతర విమానాల్లో లేదా రైళ్లలో ఉచితంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా ఇండిగోను ఆదేశించాలని అభ్యర్థించారు. అలాగే డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమగ్ర నివేదిక సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు.

# పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి భవన్ విందు

**హాజరైన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్**

**న్యూఢిల్లీ,డిసెంబర్6(జై భీమ్ న్యూస్) :**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం నిన్న రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన విందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ హాజరుకావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. ఇదే కార్యక్రమానికి లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆహ్వానం అందకపోవడం ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది. ఈ పరిణామాలపై ఎన్డీటీవీతో మాట్లాడిన శశి థరూర్, తాను విందుకు ఎందుకు హాజరయ్యారో స్పష్టతనిచ్చారు. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా తన విధి నిర్వహణలో భాగంగానే తాను వచ్చానని తెలిపారు. “విదేశాలతో సంబంధాలు నెరపడం మా కమిటీ పరిధిలోని అంశం. ఆయా దేశాలతో చర్చల్లో ఏం జరుగుతుందో, అక్కడి వాతావరణం ఎలా ఉంటుందో తెలుసుకోవడం చాలా ఉపయోగపడుతుంది. అందుకే ఇక్కడికి వచ్చాను. అంతకుమించి ఇందులో మరేమీ లేదు” అని ఆయన వివరించారు. విందుకు తనను ఆహ్వానించడాన్ని తాను గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయడంపై థరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో కొన్ని విషయాల్లో విభేదించినా, మరికొన్నింటిలో ఏకీభవిస్తూ ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలి” అని ఆయన అన్నారు. ఇటీవల ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడుతున్న నేపథ్యంలో పార్టీ మారే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఆయన ఆచితూచి స్పందించారు. “నేను కాంగ్రెస్ పార్టీ ఎంపీని. ఎన్నికల్లో గెలవడానికి చాలా కష్టపడ్డాను. వేరే నిర్ణయం తీసుకోవాలంటే చాలా విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది” అని ఆయన పేర్కొన్నారు. తన నియోజకవర్గ ప్రజల కోసం పనిచేయడమే తన ప్రధాన బాధ్యత అని థరూర్ స్పష్టం చేశారు.

# గ్లోబల్ సమ్మిట్ కాదు.. యూరియా సంగతి చూడండి

**ఉత్తర కుమార ప్రగల్భాలకు పరిమితమైన రేవంత్**
**విమర్శలు చేసిన మాజీమంత్రి హరీష్ రావు**

**హైదరాబాద్,డిసెంబరు6 (జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో యూరియా కష్టాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి గారూ.. నిన్ననే మీరు పర్యటించిన నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం ధర్మరావు పేట గ్రామంలో యూరియా కోసం రైతులు పడుతున్నఅగచాట్లు ఇవి అని ఒక వీడియోను సోషల్‌మీడియా వేదికగా పోస్టు చేశారు.రైతులకు యూరియా సరఫరా చేయడం చేతగాని రేవంత్ రెడ్డి, ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిండని హరీశ్‌రావు మండిపడ్డారు. విజయోత్సవాల పేరిట ప్రభుత్వ ధనం దుబారా చేస్తూ.. చేసింది లేక, చెప్పుకునేది లేక గప్పాలు కొట్టిండని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్ అంటూ, విజన్ 2047 అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న రేవంత్ రెడ్డి , ముందు రైతులకు యూరియా సరఫరా చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ ప్రణాళికను గాలికి వదలి రైతులు, మహిళలు, వృద్ధులు అందర్నీ యూరియా కోసం గంటల కొద్దీ క్యూ లైన్లలో నిలబెడే పరిస్థితి తెచ్చావని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. మీ దుర్మార్గ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. మీ రైతు వ్యతిరేక విధానాతో రైతులు నరకం చూస్తున్నారని అన్నారు. గత సీజన్ యూరియా కష్టాలు, చేదు అనుభవాల నుంచి మీరు, మీ ప్రభుత్వం ఏం నేర్చుకోకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. సీజన్ ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే, ముమ్ముందు పరిస్థితి ఇంకా ఎంత దారుణంగా ఉంటుంది? అని ప్రశ్నించారు. యూరియా కొరత రాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE




# ఓటీటీలోకి ధూల్ పేట్ పోలీస్ స్టేషన్

డిజిటల్ రంగంలో 100 శాతం వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతోంది ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహా . ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్ని సూపర్‌హిట్ సినిమాలు, థ్రిల్లింగ్ సస్పెన్స్ వెబ్ సిరీస్?లను సినీ ప్రియులకు అందించింది. అలాగే అన్‌స్టాపబుల్ అంటూ టాక్‌షోలు, తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్ సింగింగ్ షోలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అదిరిపోయే వెబ్ సిరీస్ లను అందించింది ఆహా. ఇక ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. ఆహాలో ఇప్పటికే ఎన్నో రకాల వెబ్ సిరీస్ టాప్ లో దూసుకుపోతున్నాయి. తాజాగా ఓ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ అందుబాటులోకి వచ్చింది.ఆ సిరీస్ మరేదో కాదు ధూల్ పేట్ పోలీస్ స్టేషన్. ఇప్పటికే ఈ సిరీస్ నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ సిరీస్ పై అభిమానుల్లో ఆసక్తి పెంచేశాయి. నేటి నుంచి ఈ సిరీస్ ప్రేక్షకులకు ఆహాలో అందుబాటులోకి వచ్చింది. ఇంట్రెస్టింగ్ స్టోరీతో ఈ సిరీస్ తెరకెక్కిందని అంటున్నారు.తమిళ యాక్టర్స్ అశ్విన్, శ్రీతు కృష్ణన్, గురు ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ కు జస్విని దర్శకత్వం వహించారు. ఆసక్తికరమైన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సిరీస్.. ఈ శుక్రవారం( నేటి నుంచి) తెలుగు, తమిళంలో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. అలానే ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు కొత్త ఎపిసోడ్ రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో నేడు ( శుక్రవారం) ఓ ఎపిసోడ్ ను రిలీజ్ చేశారు. ఇక ధూల్ పేట్ అనే ఊరిలో ఓ రోజు రాత్రి మూడు హత్యలు జరుగుతాయి. వీటిని దర్యాప్తు చేసేందుకు ఓ ఏసీపీని అపాయింట్ చేస్తారు. అతను నేరస్థులను పట్టుకోలేకపోతాడు. దీంతో మరో ఏసీపీని కూడా కేసుని దర్యాప్తు చేసేందుకు నియమిస్తారు. తర్వాత ఏమైంది? అసలు ఆ హత్యలు చేసింది ఎవరు.? ఎందుకు అనేది సిరీస్ లో చూడాల్సిందే..

# ఆంధ్ర కింగ్ తాలుకా కలెక్షన్స్ జోరు





బాక్స్ ఆఫీస్ దగ్గర లాస్ట్ వీక్ లో మంచి అంచనాల నడుమ రిలీజ్ అయిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన ఆంధ్ర కింగ్ తాలుకా సినిమా మంచి పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా అన్ని చోట్లా జోరు చూపెడుతుంది అనుకున్నా%ొ% కూడా ఓవరాల్ గా ఆ రేంజ్ లో బాక్స్ ఆఫీస్ దగ్గర ఇంపాక్ట్ ని ఏమి చూపించలేక పోతున్న సినిమా మొదటి వీక్ ని ఎలాగోలా కంప్లీట్ చేసుకోగా రెండో వీక్ లో అడుగు పెట్టిన సినిమా మరింతగా డ్రాప్స్ ను అయితే కొనసాగిస్తూ ఉందని చెప్పాలి ఇప్పుడు.ఓవరాల్ గా 8వ రోజున 6 వేలకు పైగా టికెట్ సేల్స్ ను మాత్రమే సొంతం చేసుకున్న సినిమా తెలుగు రాష్ట్రాలలో 25 లక్షల రేంజ్ లో షేర్ ని సొంతం చేసుకోగా వరల్డ్ వైడ్ గా 30 లక్షలకు పైగా షేర్ ని 60 లక్షలకు పైగా గ్రాస్ మార్క్ ని సొంతం చేసుకోగా మొత్తం మీద సినిమా 28 కోట్ల రేంజ్ లో వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగగా ఇప్పటి వరకు సాధించిన కలెక్షన్స్ కాకుండా ఇంకా 13.54 కోట్ల రేంజ్ లో షేర్ ని అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక ఈ వీకెండ్ లో సినిమా ఎలాంటి కలెక్షన్స్ ని అందుకుంటుందో చూడాలి.

# ధనుష్ 100 కోట్ల మార్క్



బాక్స్ ఆఫీస్ దగ్గర హిందీలో చాలా టైం తర్వాత మంచి బజ్ తో వచ్చిన కోలివుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన హిందీ సినిమా తేరే ఇష్క్ మే సినిమా డీసెంట్ రివ్యూలను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా మంచి జోరుని చూపెడుతూ ఉండగా సినిమా ఓవరాల్ గా%ొ% వర్కింగ్ డేస్ లో కూడా మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండగా 5 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 69.35 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకోగా 6వ రోజున వర్కింగ్ డే లో మరోసారి ఎక్స్ లెంట్ గా హోల్డ్ ని చూపించిన సినిమా%ొ%6.89 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకుంది%ొ%ఇక టోటల్ గా 6 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 76.24 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా డబ్ వర్షన్స్ తో కలిపి సినిమా 79.75 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా%ొ%ఇండియాలో గ్రాస్ 93 కోట్ల రేంజ్ లో సొంతం చేసుకుంది. ఇక సినిమా ఓవర్సీస్ లో 1 మిలియన్ రేంజ్ లో వసూళ్ళని అందుకోగా ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఇప్పుడు 6 రోజుల్లో సాధించిన కలెక్షన్స్ తో 100 కోట్ల మార్క్ ని దాటేసి మాస్ రచ్చ చేయడం విశేషం.ధనుష్ కెరీర్ లో హిందీ లో ఇవి సెన్సేషనల్ కలెక్షన్స్ అని చెప్పాలి. ఓవరాల్ గా ఎక్స్ లెంట్ కలెక్షన్స్ తో కుమ్మేస్తున్న సినిమా హిందీ లో లాంగ్ రన్ లో 100 కోట్ల నెట్ కలెక్షన్స్ మార్క్ వైపు పరుగులు పెడుతూ ఉండటం విశేషం అని చెప్పాలి.ఇక సినిమా 7వ రోజున మరోసారి మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండటంతో మరోసారి 6 కోట్ల రేంజ్ కి అటూ ఇటూగా నెట్ కలెక్షన్స్ ని అందుకునే అవకాశం ఉండగా లాంగ్ రన్ లో సినిమా ఏ రేంజ్ లో మాస్ రచ్చ చేస్తుందో చూడాలి ఇప్పుడు.



# సెట్స్‌లో అడుగుపెట్టిన సమంత..!!

ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పుడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో-ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడించింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇంస్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది. ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది. మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ - గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థ ప్రారంభించి సమంత.. తొలి ప్రయత్నంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ లో రాజ్ నిడిమోరు కూడా భాగం పంచుకున్నాడు. ఇప్పుడు అదే బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' చిత్రం తెరకెక్కుతోంది. దీనికి రాజ్ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 'ఓ బేబి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కలిసి చేస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా 'మా ఇంటి బంగారం' రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సమంత ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.